OSMANIA UNIVERSITY
100 YEARS
Centenary Celebrations
1917-2017

₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 8
పక్షపత్రిక ఏప్రిల్ 16-30, 2017





## ఓ యోగి విజయం వెనకా 'అదే గాథ'

## యూత్‌కి ఛాలెంజ్ : 70 ఏళ్ళ వయసులో గద్దర్ మరో పోరాటం.. తూటా నుంచి ఓటుకి!










# విద్యతోనే జాతికి విశిష్టత : జేపీ

ఒక జాతి విశిష్టత, ఆత్మగౌరవం సరైన విద్యతోనే సాధ్యమని, కానీ మనదేశంలో విద్య, వైద్య రంగాల తీరు అధ్వాన్నంగా ఉన్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మానవ మనుగడకు కీలకమైన ఈ రంగాలను సంస్కరించుకోవాలన్నారు. యువత తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉన్నతస్థితికి ఎదగాలన్నారు. బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలకు చెందిన ఎక్స్‌ప్రెషన్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వార్షిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం 'దేశాన్ని అభివృద్ధి చేసే అంశాల' పై విద్యార్థులతో చర్చా గోష్ఠి నిర్వహించారు. ఇండియాస్ ఫ్యూచర్ ఫౌండేషన్, హైదరాబాద్ స్టూడెంట్స్ ఫర్ లిబర్టీ సంస్థలు ఈ కార్యక్రమానికి సహ నిర్వాహకులుగా వ్యవహరించాయి.

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఏప్రిల్ 16-30, 2017

సంపుటి - 8 సంచిక - 8

## లోపలి పేజీల్లో...


ఓ యోగి విజయం వెనకా.................. 5

త్వరపడితేనే.... ఇల్లు చక్కదిద్దుకోగలం.. 11

యూత్‌కి ఛాలెంజ్ : 70 ఏళ్ళ ............. 15

లోక్‌సత్తా అనే ఎత్తు మీద ఉన్నాం కాబట్టే .16

శాసన నియంత్రణను బలహీనపరిచే..... 19

పట్టిసీమ వృథా... విద్య, వైద్యం అధ్వాన్నం 23

పేదరిక రహిత పంచాయతీలు............ 27

ఈసురోమంటున్న విద్యార్థి భారతం...... 28

పన్నులు ఎందుకు చెల్లించాలో చెప్పాలి..30

గ్రామ న్యాయాలయాల అమలుతో........ 31

టీవీ న్యూస్ సంచలనాలు...................32

130 కోట్ల జనాభాలో ప్రతిభ గలవారిని 33

చంద్రబాబుది రాజ్యాంగ ఉల్లంఘన: జేపీ 34



### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# ఉస్మానియా ఉత్సవ పిలుపు



ఉస్మానియా విశ్వవిద్యాలయ గమనం గతం కాదు.. ఘనచరిత్ర. అందుకే ఓయూ వందేళ్ల మైలురాయిని దాటే సందర్భం మన సత్తాకి, సంకల్పశక్తికి సవాలు విసురుతోంది. 'నా చరిత్ర నుంచి దర్శనమిస్తున్న ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోగల పాటవం ఉందా' అని ప్రశ్నిస్తోంది. ఈ చారిత్రక బాధ్యతను నెరవేర్చేలా ఉస్మానియా తొలి శతాబ్ది ఉత్సవాలుండాలి. సమాజంలో, రాజకీయాలలో మంచి నాయకత్వం రావాలన్నా, రాష్ట్రం, దేశం వృద్ధి చెందాలన్నా, జనం సుఖసంతోషాలతో బతకాలన్నా.. ప్రధానంగా ఉండాల్సింది మంచి చదువు! అత్యంత సంతోషకర దేశంగా నార్వే గుర్తింపు పొందిందంటే, పాలకులు ఆరోగ్యంతోపాటు నాణ్యమైన విద్యను సమకూర్చటమే అందుకు కారణం. నార్వేలో చదువుకున్నవారు ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరితోనైనా పోటీపడగలిగే సామర్థ్యం ఉన్నవారు. కానీ మనం.. ప్రాథమిక స్థాయి నుంచీ చదువును ఓ కుట్ర పన్నినట్టు దిగజార్చాం. సమాజంలో అత్యధికులకు చదువంటే ఏమిటో అర్థం కాకపోయినా అందుకోసం ఎగబడుగున్నారు కాబట్టి.. విద్యాహక్కు వంటి చట్టాలతో చదువు అందిస్తున్నట్టు నటిస్తున్నాం. అత్యధికులకు పాఠశాల స్థాయిలో మంచి చదువు లేకపోవటం వల్ల విశ్వవిద్యాలయాల స్థాయిలో చదువూ బలహీనపడుతోంది. ఉన్నత విద్య సరిగా లేకపోవటం వల్ల పాఠశాల స్థాయిలో మంచి అధ్యాపకులూ కరవవుతున్నారు. దీంతో, నిధులు కేటాయిస్తున్నా విద్యార్థులకు, తల్లిదండ్రులకు, సమాజానికి ఫలితంలేని విద్యావ్యవస్థ తయారైంది. స్వతంత్ర భారతదేశంలో ఉన్నతవిద్యను తీర్చిదిద్దే మహాకార్యానికి నాంది పలకగలిగే స్థాయి లెగాసీ ఉస్మానియాకు ఉండింది. కానీ పాలకుల నేరనిర్లక్ష్యం వల్ల క్రమంగా ఉస్మానియా సైతం విశిష్టతలను కోల్పోయి సంక్షోభంలో కూరుకుపోయింది. జస్టిస్ జగన్మోహన్ రెడ్డి వంటి వారు పరిస్థితుల్ని సరిదిద్దే ప్రయత్నం చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన రఘోత్తమ రెడ్డి తనకు డిగ్రీ లేకపోయినా ఎంతో దూరదృష్టితో, వివేకంతో ఓయూకి బలం చేకూర్చారు. అలాగే ప్రొఫెసర్ దయారత్నం, హాషీమ్ అలీ, ప్రొఫెసర్ సింహాద్రిలాంటి వారు గర్వించదగ్గ సేవలతో సంస్థను నిలబెట్టే ప్రయత్నం చేశారు. కానీ అందరికీ విద్య పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మళ్లీ తప్పటడుగులు కొనసాగాయి. అస్తిత్వ ఉద్యమాలు పక్కదోవ పట్టి అప్రజాస్వామిక ధోరణులుగా మారినా ఓటు బ్యాంకుల కోసం వినియోగించుకునేందుకు పాలకులు పిరికితనంతో, సంకుచిత రాజకీయ తత్వంతో వ్యవహరించి జాతి ప్రయోజనాలను పణంగా పెట్టారు. 2000 సంవత్సరం తర్వాత వీసీగా వచ్చిన ప్రొఫెసర్ డీసీ రెడ్డి ఎంతో కష్టపడి ఉస్మానియా పూర్వవైభవాన్ని పునరుద్ధరిస్తే.. ఆయనపై బురదజల్లి నానాయాగీ చేశారు. తొంభై శాతం మంది విద్యార్థులకు మేలు చేసే పనులు చేపట్టిన ఆ వీసీని కేవలం పది శాతం మంది స్వార్థప్రయోజనాల కోసం వేధించగలిగారంటే.. పనికిమాలిన రాజకీయ నాయకులే (తమ పిల్లలకు మాత్రం మంచి చదువు అందించుకుంటారు వీరు) అందుకు కారణం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా.. ఆ పరంపరలో ఇప్పటికీ పెద్దమార్పు రాలేదు. వైస్ ఛాన్సలర్ పదవి కోసం ఇటీవల ఒక విద్యావేత్త తెలంగాణ ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన ఓ మంత్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడిన తీరును మీడియాలో చూసి చాలా బాధేసింది. విశ్వవిద్యాలయం అంటే.. నిర్వచనంలోనే విశ్వజనీన స్వభావం కలిగినది. కానీ కులం, మతం, ప్రాంతం, భాష, పార్టీ కళ్లద్దాల నుంచి చూస్తూ తమ అడుగులకు మడుగులత్తే వీసీలను ఎంపికచేయటం, వర్సిటీలలో చైతన్యం తలెత్తకుండా అణచేయటాన్ని వీసీ బాధ్యతల్లో చేర్చటం వంటివి వర్సిటీలను కుంగదీస్తున్నాయి. ప్రపంచంలోని చాలా అభివృద్ధి చెందిన దేశాలు వైస్ ఛాన్సలర్ల కోసం దేశదేశాలలో అన్వేషిస్తాయి. ఒక యూనివర్సిటీలో చదువుకున్న వారు అదే చోట అధ్యాపకులుగా పనిచేయకుండా జాగ్రత్తలు పాటిస్తాయి. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా పత్రాలను తయారుచేయటాన్ని ప్రోత్సహించి వాటి ఆధారంగా విధానాలను రూపొందిస్తుంటాయి. కానీ మన వద్ద పౌరసమాజం ఇచ్చే మంచి ఆలోచననే తీసుకోవడం ఇష్టంలేని పాలకులు యూనివర్సిటీల్లో భావవికాసాన్ని వీలైనంత అణగదొక్కుతున్నారు. పరిశోధనలను నీరుగారుస్తున్నారు. తాము చెప్పిందే వినాలని, తినాలని, మాట్లాడాలని.. సృజనశీల ఆలోచనాశక్తిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. మనదేశంలో పార్టీల తీరు, ప్రజాస్వామిక పరిణామక్రమం, రాజ్యాంగం, అవినీతి, విద్య, సామాజిక వివక్ష వంటి అంశాల మీద ప్రామాణిక వివరాలు కావాలంటే మనం మైరన్ వీనర్, రాబర్ట్ వేడ్, మోరిస్ జోన్స్, గ్రాన్‌విల్ ఆస్టిన్ వంటి విదేశీ మేధావుల మీద ఆధారపడాల్సి వస్తుందంటే అందుకు కారణం మన విశ్వవిద్యాలయాలను పాలకులు, వారికి తొత్తులైన అధికారులు, అధ్యాపకులు దిగజార్చటమే. స్వతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా 130 కోట్లమంది ప్రజల్లో నిజమైన ప్రతిభాపాటవాలు కలిగినవారిని ఇంకా వేళ్ల మీదే లెక్కపెడుతున్నామంటే ఎంత సిగ్గుచేటు! ఇటీవల ఉస్మానియా వర్సిటీలో ఓ కార్యక్రమానికి వెళితే, ఉద్యోగాల పట్ల విద్యార్థులు ఎంతో భయాందోళనలతో కనిపించారు. ఉపాధి అభద్రతనే అధిగమించలేని ఉన్నత విద్యావంతుల నుంచి.. ఆత్మవిశ్వాసం, సమాజం, రాజకీయ, పాలనా వ్యవస్థల్లో విప్లవం వంటి అంశాల పట్ల ఆసక్తిని ఎలా ఆశించగలం? దేశంలో ఇటీవలి రేటింగ్‌లో ఉస్మానియా వర్సిటీకి వచ్చిన 38వ ర్యాంకును మెరుగుపరచటం సమస్య కాదు. అసలు సమస్య.. కోట్లాది కూపస్థ మండూకాలను, సంకుచిత రాజకీయ విన్యాసంలో పావులను, నిరుద్యోగ పట్టభద్రులను తయారుచేస్తున్న మన ఉన్నత విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయటం! పాఠ్యాంశాల్ని, పరీక్షా పద్ధతుల్ని సమూలంగా మార్చటంతోపాటు.. లెక్కలు, సైన్స్, సామాజిక శాస్త్రాలు వంటి కృత్రిమ విభజనను తొలగించాలి. ఉపాధి నైపుణ్యాలతో, వికసిత మేధస్సుతో, సృజనాత్మకంగా తమదైన బాణీలో శాస్త్రీయంగా, నిర్మాణాత్మకంగా ఆలోచించగలిగే యువతను తయారుచేసే కేంద్రాలుగా విశ్వవిద్యాలయాల్ని తయారుచేయాలి. ఇందుకు అవసరమైతే ప్రయివేటు పెట్టుబడులనూ ఆహ్వానించాలి. కానీ వాళ్లు తమ వాణిజ్యానికి ఉపయోగపడే కోర్సులను మాత్రమే ప్రోత్సహించకుండా ప్రభుత్వం జాగ్రత్తపడాలి. ఐఐటీలకన్నా మిన్న అనుకుని చేరేలా కళాశాలల్ని, యూనివర్సిటీలను పునరుజ్జీవింప చేయటానికి .. తమ సుఖాన్ని, సమాజ హితాన్ని సంధానం చేయగలిగే కొత్త తరాన్ని అందించటానికి ఉస్మానియా వందేళ్ల పండుగ వేదిక కావాలి.

మీ




I personally would suggest government. They never go to jail.

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.





# ఓ యోగి విజయం వెనకా 'అదే గాథ'

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ ప్రమాణస్వీకారం.. భారత రాజకీయాలను కుదిపేసే మార్పులస్తున్నాయనటానికి సంకేతమని పలువురు భావిస్తున్నారు.

భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలి తప్ప, కాషాయం ధరించటం ముఖ్యమంత్రి పదవికేమీ అనర్హత కాదు. అలాగే గతంలో యోగిలాంటి ఉమా భారతి కూడా ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అయితే.. ఆదిత్యనాథ్ విషయం వేరు, ఇది సీస్మిక్ ఛేంజ్ అన్నది వాదన.. ఈ రకమైన వాదనల్ని పూర్తిగా తోసిపుచ్చలేం.

కుల సమీకరణలకు పేరుమోసిన యూపీలో 'అభివృద్ధి – హిందూత్వ పరిధిలో చిన్న కులాల ఏకీకరణ – హిందూత్వ చుట్టూనే మైనారిటీలు' అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ వదిలిన ఫార్ములా ఎన్నికల గతినే మార్చివేసింది.

అసమానతలకు నిలయమైన కులాల సమాహారంగా ఉండే హిందూత్వ పరిధిలోనే.. కుల, మతాలకతీతంగా వ్యవహరిస్తున్నారన్న భావనను కల్పించి ఓట్లు కొల్లగొట్టటంలో మోదీ అద్భుత నైపుణ్యంతో సఫలమయ్యారు. క్షేత్రస్థాయిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా బృందం నిర్దాక్షిణ్య వ్యూహ వ్యవహారశైలికి యోగి ఆదిత్యనాథ్ హిందూత్వ కేంద్రీకృత నిర్మాణం తోడై.. సమాజ్‌వాదీ–కాంగ్రెస్, బహుజన్ సమాజ్ పార్టీల కుల, మత ఓట్ల లెక్కలను కకావికలు చేసింది.

పార్టీల సంగతి అలావుంచితే.. అసలీ యోగి ఆదిత్యనాథ్ ఎలా రూపుదిద్దుకున్నారు? అన్నదే ప్రజల కోణంలో పరిశీలించాల్సిన ప్రశ్న.

గణితంలో బీఎస్సీ చేసిన యోగి ఆదిత్యనాథ్ తన అసలు పేరు అజయ్ సింగ్ బిష్త్‌ను మార్చుకుని 22 ఏళ్ల వయసులో కాషాయం ధరించి ఓ మఠాధిపతి కావటం వెనక చాలా పరిణామాలున్నాయి.

ముస్లిం ఛాందసులను సంతృప్తి పరచటానికి కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ ప్రభుత్వం ముస్లిం మహిళల పోషణ బిల్లును, ఆ తర్వాత హిందూ ఛాందసులను సంతృప్తిపరచటానికి అయోధ్య రామాలయం తలుపులు తెరిచి శిలాన్యాసాన్ని అనుమతించటం, దూరదర్శన్‌లో రామాయణ సీరియల్ ప్రసారాన్ని ఆమోదించటం వంటి చర్యలు అందుకు తక్షణ కారకాలు. రాజీవ్‌గాంధీ అయోధ్య విషయంలో, ముస్లిం మహిళల బిల్లు విషయంలో హ్రస్వదృష్టితో వ్యవహరించటంతోపాటు ఆ బిల్లుపై ప్రశ్నించకుండా దూడూ బసవన్నల్లా కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు ఓటు వేసేలా చెయ్యటానికి విప్‌ను ధిక్కరిస్తే అనర్హత వేటు వేసే 52వ రాజ్యాంగ సవరణను కూడా తీసుకొచ్చారు. ఈ పరిణామాలు అజయ్ సింగ్ అనే యువకుడిని అయోధ్యలో రామమందిర నిర్మాణ నినాదాన్ని ఎత్తుకునేలా చేసి గోరఖ్‌పూర్ మఠంలో చేరేలా చేశాయి. యోగి ఆదిత్యనాథ్‌గా మార్చాయి.

ఆ మఠం ప్రధాన పూజారి (మహంత్)గా ఉన్న అవైద్యనాథ్‌తో కలిసి హిందూ మహాసభ వేదికగా ఆదిత్యనాథ్ హిందూత్వ తీవ్ర

రాజకీయాలు చేశారు. అవైద్యనాథ్ బాటలోనే బీజేపీలో చేరి 1998లో గోరఖ్‌పూర్ స్థానం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. 12వ లోక్‌సభలో అతి పిన్న వయసు (26) సభ్యుడు ఆదిత్యనాథ్. 2014లో అవైద్యనాథ్ మృతితో నాథ్ తెగల సంప్రదాయంలో గోరఖ్‌పూర్ మఠాధిపతి అయ్యారు.

ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలలో పాల్గనటం ద్వారా గాంధీ హత్య వంటి పరిణామాల ముద్రను దాటి జనసంఘ్/ ఆర్ఎస్ఎస్ ప్రజామోదాన్ని సాధించగలిగింది. ఆ తర్వాత ఏర్పడిన జనతా ప్రభుత్వంలో చేరటం ద్వారా ప్రధాన స్రవంతి శక్తిగా గుర్తింపు పొందింది. రాజీవ్‌గాంధీ హయాంలో జరిగిన పరిణామాలతో యూపీలో ఒక ప్రబలశక్తిగా హిందూత్వ శక్తులను సమీకరించటానికి ఆర్ఎస్ఎస్‌కు ఓ పెద్ద అవకాశం కల్పించాయి.

ఈ నేపథ్యం నుంచే యోగి ఆదిత్యనాథ్ తయారైనా.. ఒక ముఖ్యమంత్రి కాగలిగే స్థాయిలో ప్రజాదరణ పొందటానికి దోహదం చేసింది మాత్రం లోక్‌సత్తా ఎప్పటినుంచో హెచ్చరిస్తున్న 'అధ్వాన్న పౌరసేవలు'! ప్రజలకు హక్కుగా అందించాల్సిన ఈ సేవలను వారి నుంచి లంచాలు గుంజుతూ, వారిని అవమానిస్తూ, వేధిస్తూ అందించే పాలనా వ్యవస్థ ఆదిత్యనాథ్ పాప్యులర్ కావటానికి దోహదం చేసింది. ఓవర్ సింప్లిఫైడ్‌గా అనిపించొచ్చుగానీ, ఇదే అసలైన వాస్తవం.

ఐదుసార్లు ఎంపీ అయిన ఆదిత్యనాథ్ 2014 నుంచి ఇప్పటివరకూ 284 ప్రశ్నలు అడిగారు. హిందూత్వకు సంబంధించి కేవలం 8 చర్చలు (14.5శాతం), రెండు ప్రశ్నలు (0.7శాతం) మాత్రమే ఈయన రికార్డుల్లో ఉన్నాయి. ఎక్కువశాతం ఇతర అంశాలకు సంబంధించే ఉన్నాయి. ముఖ్యమంత్రిగా కూడా అభివృద్ధి ఎజెండా గురించే ఎక్కువగా ఉచ్చరిస్తున్నారు. రోమియోల ఆటకట్టించే పోలీసు బృందాల అతి ధోరణులపై బహిరంగంగానే విమర్శించారు. హిందూత్వ ఛత్రం కింద పౌరసేవల చుట్టూనే ఆదిత్యనాథ్ ప్రాచుర్యం పొందారన్నదే వీటన్నిటి సారాంశం.

గోరఖ్‌పూర్ మఠానికి వచ్చే ప్రజల ఫిర్యాదులను తీసుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆ పనులు చేసిపెట్టటం ద్వారా. సెటిల్‌మెంట్లు చేయటం ద్వారానే యోగి హీరోగా మారారు.

బాలీవుడ్ హీరో షారుక్‌ఖాన్‌ను హఫీజ్ సయిద్‌తో పోల్చటం, హిందువులను క్రైస్తవుల్లోకి మార్చటమే మదర్ థెరెసా లక్ష్యమని ఆరోపించటం, లవ్ జిహాద్, ఘర్‌వాప్సీ వంటి కార్యక్రమాలతో ఆదిత్యనాథ్ భయాందోళనలు రేకెత్తిస్తుంటారు. ఈ క్రమంలో కేసుల్ని కూడా లెక్కచేయకుండా వ్యవహరిస్తుంటారు. ఇలా నాథ్ సంప్రదాయంలోని తీవ్రవాద పంథాలో కొంతమంది యువతను గోరఖ్‌పూర్ మఠంలో తయారుచేశారు. గోరఖ్‌పూర్ మఠంలో ప్రతి రోజూ 2గంటల పాటు జనతా దర్బార్ నిర్వహిస్తారు. స్థానికంగా ఉండే ముస్లింలు కూడా పెద్దసంఖ్యలో ఇక్కడకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటారు. మఠాధిపతి ఇచ్చే సిఫారసు లేఖ ప్రకారం పనిచేసిపెట్టకపోతే, ఆ ప్రభుత్వాధికారిగానీ, కాంట్రాక్టరుగానీ, భూస్వామిగానీ, గూండాలుగానీ భారీ మూల్యం చెల్లించాల్సిందే. మఠం నుంచి నోటి మాటగానో, లేఖ రూపంలోనో సిఫారసు వెళితే చాలు.. ఆ పని పూర్తయినట్టే.

## ప్రతి నలుగురు ఎమ్మెల్యేలలో ఒకరిపై తీవ్ర నేరారోపణలు

ఉత్తర ప్రదేశ్ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గిన ప్రతి నలుగురు ఎమ్మెల్యేలలో ఒకరిపై హత్య, అత్యాచారం వంటి తీవ్ర నేరారోపణలున్నాయి. అలాగే ప్రతి 10మంది ఎమ్మెల్యేలలో ఎనిమిది మంది కోటీశ్వరులు. 2012 ఎన్నికలతో పోలిస్తే యూపీలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన నేరచరిత్రుల సంఖ్య ఈ ఏడాది తగ్గినా, తీవ్ర నేరాభియోగాలున్నవారి సంఖ్య మాత్రం పెరిగింది.

2012లో క్రిమినల్ నేరారోపణలున్న ఎమ్మెల్యేలు 189 (47శాతం) కాగా, 2017లో ఆ సంఖ్య 143 (36శాతం). తీవ్ర నేరారోపణలున్నవారి సంఖ్య 2012లో 98 (24శాతం) కాగా, ఈ ఏడాది 107(26శాతం). క్రిమినల్ నేరాభియోగాలున్న వారిలో అత్యధికంగా 83 మంది అధికార బీజేపీ నుంచే ఉన్నారు.

అలాగే కోటీశ్వరులు గత ఎన్నికల్లో 271 మంది (67శాతం) గెలుపొందగా, ఈసారి ఆ సంఖ్య 322 (80శాతం)కి పెరిగింది.

యూపీతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాలను కూడా పరిగణలోకి తీసుకుంటే, మొత్తం ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో విజయం సాధించిన 690మంది ఎమ్మెల్యేలలో 192మందిపై క్రిమినల్ కేసులున్నాయని 'నేషనల్ ఎలక్షన్ వాచ్' (న్యూ), 'అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)ల నివేదిక తెలిపింది. ఎమ్మెల్యేల అఫిడవిట్ల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

ఐదు రాష్ట్రాలలో ఎన్నికైనవారిలో 78శాతం మంది కోటీశ్వరులేనని నివేదిక తెలిపింది.

అలాగే ఈ అసెంబ్లీలకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లో 329 మంది (48శాతం) 25-50 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారే. 52శాతం మంది (358మంది) 51-80 ఏళ్ల మధ్య వయసున్నవారు. విద్యార్హతల విషయానికొస్తే.. వీరిలో 28శాతం (193మంది) 5-12 తరగతులలోపే చదువుకున్నారు. 69శాతం (473 మంది) డిగ్రీ చదువుకున్నవారు ఉన్నారు.

పోలీసు స్టేషన్లో పనులు, ధ్రువీకరణ పత్రాలు, నీట, విద్యుత్ కనెక్షన్లు, స్థలాల్ని కబ్జా చేయటం, పట్టాలు ఇప్పించటం వంటి వాటన్నిటికీ మఠం మహారాజ్ సాయం చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా అందాల్సిన సేవలను అక్కడ లంచాలు, వేధింపులుతో చేయకపోవటం.. యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్ మఠం కేంద్రంగా హీరోగా అవతరించటానికి దోహదం చేసిందనటానికి ఇవన్నీ స్పష్టమైన సాక్ష్యాలు.

ఇదే అంశాన్ని ఇంకొంచెం లోతుగా పరిశీలిస్తే.. మోదీ చిన్న కులాల సమీకరణ ఫార్ములా విజయవంతమవటానికి కూడా ప్రజలకు హక్కుగా అందించాల్సిన పౌరసేవలు అధ్వాన్నంగా ఉండటవే కారణమని తేటతెల్లమవుతుంది.

ప్రజలకు సర్కారీ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటం ద్వారానే గతంలో యూపీలో యాదవులు, జాట్లు దిగువ కులాల ఓట్లను కొల్లగొట్టి పెత్తనం చేస్తుండేవారు. పోలీస్ స్టేషన్లో ఒక చిన్న పనికావాలంటే, యాదవ పెద్ద వద్దకో, జాట్ ఆసామి వద్దకో వెళ్లాల్సి వచ్చేది. ఒక కేసును పరిష్కరించాలంటే, వారి ముందు చేతులు జోడించి నిలుచోవాల్సి వచ్చేది. కానీ ఆర్థిక సంస్కరణలు, పట్టణీకరణ, మొబైల్ సాంకేతిక పరిజ్ఞానంతో ఆ పరిస్థితిలో క్రమంగా మార్పు వస్తోంది. దిగువ కులాల్లోనే ఈ సమస్యల్ని పరిష్కరించే ఛోటా నేతలు తయారయ్యారు. వీళ్లూ వ్యవస్థను బాగుచేయరుగానీ.. పై కులం వారి దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే తమ కులపోళ్లకు కాస్త తక్కువ ఖర్చుకు, తక్కువ ఇబ్బందితో పనులు చేసిపెడుతుంటారు. ఈ పరిస్థితులన్నీ చిన్న కులాలవారిని మోదీ అభివృద్ధి, యాదవ-జాటేతర హిందూత్వ చట్రంలోని భరోసా పట్ల ఆకర్షితులయ్యేలా చేసింది. ఈ చట్రంలోనే ఉన్న యోగి ఆదిత్యనాథ్ చట్టానికతీతమైన దాదాగిరి సేవలు ఎలాగూ ప్రాచుర్యం పొందాయి. ఇలా అన్నీ కలిసి యూపీలో బీజేపీకి కళ్లు చెదిరే విజయాన్ని అందించాయి.

భారత ప్రజాస్వామ్యంలోని (ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తూ అధ్వాన్న పౌరసేవలు అందించటమనే) ఒక అతిపెద్ద లోపాన్ని సరిచేయకుండా.. తాయిలాలు, కులాలు, మతాలు, ప్రాంతాల చుట్టూ రాజకీయం చేస్తూ ఇప్పటిదాకా ఎన్నికలలో గెలుస్తున్న పార్టీల వ్యవహారశైలినే మోదీ యూపీ నేపథ్యానికనుగుణంగా చాలా తెలివిగా ఉపయోగించుకుని ఈ ఎన్నికల్లో నెగ్గారు. యోగి కాస్తా ముఖ్యమంత్రి స్థాయికి ఎదగగలిగారు.

ప్రజల్ని ప్రభువులుగా చూడాల్సిన వ్యవస్థను నిర్మించకుండా.. బ్రిటిష్ వలస పాలకుల కాలంలోలా ప్రజల్ని యాచించేవారుగా, ద్వితీయశ్రేణి పౌరులుగా చూడటం ప్రభుత్వ కార్యాలయాల్లో పరిపాటిగా కొనసాగుతోంది. ఒక చిన్న ధ్రువపత్రం కావాలంటే, లంచమో, సిఫారసో తప్పనిసరి అవుతోంది. టెక్నాలజీ పెరిగినా పట్టాదారు పాసుపుస్తకం వంటి సేవలకు రూ.50వేలు దాకా లంచం ఇవ్వాల్సి వస్తోంది. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటమే గెలుపునకు ఏకైక మార్గంగా పలువురు ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఎమ్మెల్యేల శిక్షణా తరగతుల్లో కూడా

## నాథ్ సంప్రదాయం

నాథ్ సంప్రదాయం శతాబ్దాల కాలం నుంచి ప్రచారంలో ఉన్నా, దానికి గోరఖ్‌పూర్ ఆశ్రమాన్ని కేంద్ర బిందువుగా చేసింది యోగి మత్స్యేంద్రనాథ్. నేపాల్ సరిహద్దుల్లో ఉండటం వల్ల ఆ ఆశ్రమానికి అక్కడ కూడా పేరుప్రతిష్టలు ఉండేవి. మత్స్యేంద్రనాథ్ పరంపరను బాగా ప్రాచుర్యంలోకి తెచ్చింది మాత్రం యోగి గోరఖ్‌నాథ్. నాథ్ సంప్రదాయంలో మరుగున పడిపోయిన పద్ధతుల్ని తిరగి ప్రవేశపెట్టారీయన. ప్రచారం కోసం పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక, ఆఫ్గనిస్తాన్, ఇరాన్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. మన శరీరంలోని కుండలినీ శక్తిని జ్ఞానం లేదా యోగ మార్గాల ద్వారా మేలుకొలపటం గురించి నాథ్ సంప్రదాయం వివరిస్తుంది. కుండలినీ శక్తిని మేలుకొలపటంలో భాగంగా చెవులను కుట్టటం ఆనవాయితీగా అనుసరిస్తుంటారు. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ తరహాలోనే కుండలాలను ధరిస్తారు. కులాన్ని గోరఖ్‌నాథ్ వ్యతిరేకించారు. అందుకే గోరఖ్‌పూర్ మఠాధిపతులు బ్రాహ్మణులు కాకుండా వేర్వేరు కులాలవారు ఉంటారు.



## నితీష్ కుమార్ మినహాయింపు



పెద్ద నోట్ల రద్దు నిర్ణయంపై మోదీని స్పష్టంగా సమర్థించిన ప్రముఖ ప్రతిపక్ష పార్టీ నాయకుడు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మాత్రమే. మోదీతో తీవ్ర రాజకీయ విభేదాలున్నా నోట్ల రద్దును నితీష్ సూత్రప్రాయంగా సమర్థించారు. అమలులో లోపాలున్నా ఈ నిర్ణయంలో మోదీ చిత్తశుద్ధిని గౌరవిస్తున్నానని చెప్పి, అందుకు కట్టుబడివున్నారు. ఓటమిని, ప్రత్యర్థుల విమర్శలను సహించటంలో చెత్త రికార్డున్న మోదీ కూడా.. సుపరిపాలన, అవినీతిరహిత విధానాల పట్ల నిబద్ధతను కనబరిచే నితీష్ కుమార్ విషయంలో సాదరభావంతోనే వ్యవహరిస్తూ బీహార్‌కు సాయం అందిస్తున్నారు. యూపీ ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఈ మాత్రం విజ్ఞతను ప్రదర్శించి ఉంటే.. మోదీ పరిమితులపై ప్రజలకు చాలా స్పష్టత వచ్చి ఉండేది. ఎన్నికల తీర్పు ఇంత ఏకపక్షంగా ఉండేది కాదు.

ఇదే సక్సెస్ ఫార్ములాగా చెబుతుంటారు. ప్రభుత్వ వ్యవస్థతో సంబంధం లేని ఎమ్మెల్యే.. ఇలా ఓటర్లకు పనులు చేసిపెట్టటానికి ప్రతి నియోజకవర్గంలో కిరాయి కార్యకర్తలను మెయింటెయిన్ చేయటం, ఆఫీసుల్ని నిర్వహించటం చేస్తుంటారు. ఇందుకు ప్రతి ఎమ్మెల్యేకు తక్కువలో తక్కువగా రూ.10లక్షలు ఖర్చవుతుందని అంచనా. ఈ ఖర్చుకు పదిరెట్లు దండుకోవటం కోసం దోపిడీ చేస్తుంటారు. ఇదే విషవలయం నల్లధనాన్ని పెంచి పోషిస్తోంది.

ఎమ్మెల్యే దాకా వెళ్లనక్కర్లా.. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేటర్ల సమావేశంలో ఓ ప్రముఖ తెలుగు పత్రిక నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ చూస్తే చాలు, విషయం అరటిపండు ఒలిచిపెట్టినట్టు అర్థమవుతుంది (2016 మే మాసంలో మరో ప్రముఖ తెలుగు పత్రిక కూడా డివిజన్లవారీగా ఇదే తరహా వాస్తవాల్ని బైటపెట్టింది). "మాకూ ఖర్చులు ఉంటాయి. ఒక్కొక్కరం గెలవటానికి రెండు నుంచి రెండున్నర కోట్లు ఖర్చు పెట్టాం. నెలకు కనీసం రూ.రెండు లక్షల ఖర్చుంటుంది. ఇక ఇప్పుడు పార్టీ సభ్యత్వం అంటున్నారు. దానికి ఏడెనిమిది లక్షలైనా ఖర్చు ఉంటుంది. మీరు ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి బిల్డింగులు కడుతుంటారు. లక్షో, రెండు లక్షలో స్థాయిని బట్టి ఇష్టంగా ఇస్తా ఉండాలి" అని పలువురు కార్పొరేటర్లు బిల్డర్లకు తేల్చిచెప్పారు. బిల్డర్ల నుంచే కాదు.. రేకుల షెడ్ తీసి ఇల్లు కట్టుకునే వారి దగ్గర్నుంచి కూడా రూ.3-4 లక్షలకు తక్కువ కాకుండా కార్పొరేటర్లు వసూలు చేస్తుంటారు. అధికారుల చేత లంచాలు వసూలు చేయించి, ఎమ్మెల్యే దాకా పంపిణీలు చేస్తుంటారు.

చివరికి ప్రభుత్వోద్యోగులు చేయాల్సిన పనిని శాసనసభ్యులు చేయటం, శాసనాలు చేయాల్సిన అసెంబ్లీలో కొట్టుకోవటం లేదా కాలక్షేపం చేయటం జరుగుతూ.. జనం జీవితాల్ని మార్చే ఏ ఒక్క పనీ సక్రమంగా జరగకుండా ఎన్నికల తరబడి వాయిదా పడుతూ వస్తుంటుంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ నిర్ణీత గడువును నిర్ణయించి, ఆలోగా పూర్తికాకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారం చెల్లించే హక్కుగా 'పౌర సేవల' చట్టాన్ని లోక్‌సత్తా 1998లో ప్రతిపాదించినా ఇప్పటిదాకా సరైన అమలు చర్యలు లేవు.

ఇంకోవైపు, కోర్టులో కేసు వేసి న్యాయంగా సకాలంలో నెగ్గుతామన్న గ్యారంటీ లేదు. తక్కువ ఖర్చుతో, వేగంగా పరిష్కారం అందించేందుకు స్థానిక న్యాయాలయాలు వంటి వాటి ఏర్పాటు మీద హైకోర్టు న్యాయమూర్తులకు కూడా ఆసక్తి లేదు. ఈ మొత్తం అవ్యవస్థే ఆదిత్యనాథ్ అనే యోగి విజయం వెనక కూడా ఉంది.

పౌరసేవల చుట్టూ ఈ లొసుగు తెలుసు కాబట్టే.. యోగి అధికార బాధ్యతలు తీసుకున్నాక ప్రజల్లో ముద్ర వేయటానికి ప్రకటించిన తక్షణ నిర్ణయాల్లో అత్యధికం ప్రభుత్వ కార్యాలయాలను చక్కదిద్దేవే. పోలీసు స్టేషన్ల తనిఖీలు, సర్కారీ ఆఫీసుల్లో సీసీ కెమేరాలు, బయో మెట్రిక్ ఏర్పాటు, ప్రతి నెలా నివేదికలు, టీచర్ల ఫోన్లపై నియంత్రణలు వంటివన్నీ ఈ కోవలోనివే. పౌర సేవలను సక్రమంగా అందించేందుకు సిటిజన్ ఛార్టర్లను ఏర్పాటు చేస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఇవన్నీ తాత్కాలిక ఉపశమనాలా? నిజంగా సుపరిపాలన చర్యలా? అనేది ముున్ముందు స్పష్టమవుతుంది.

**పెద్ద నోట్ల రద్దులో మోదీ తప్పిదాల్ని చెప్పటంలో ప్రతిపక్షాల వైఫల్యం**

యోగి ఆదిత్యనాథ్, మోదీ పౌరసేవల చుట్టూ చేసిన హిందూత్వ, చిన్న కులాల ఏకీకరణ ప్రచారానికి.. అమిత్ షా బూత్ స్థాయి నిర్మాణం, మీడియాపై బీజేపీ పట్టు, కొరత లేకుండా డబ్బును వెదజల్లటం వంటివాటితో పాటు పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్)లోని లోపాల్ని చర్చించకుండా ప్రతిపక్షాలు గుడ్డిగా వ్యతిరేకించటం కూడా మోదీ పట్ల ప్రజల్లో సానుకూలత పెరగటానికి దోహదం చేసింది.

నోట్ల రద్దు వల్ల కేంద్ర ప్రభుత్వం ఆశించినట్టు పెద్ద లబ్ధి చేకూరకపోగా, సామాన్యులు ఇక్కట్లు పడ్డారు. నల్లధనం మళ్లీ తయారవుతోంది. అయినా పెద్దల మీద పెద్ద దాడికి దిగిన

హీరోగా నరేంద్రమోదీని ఉత్తర ప్రదేశ్ ప్రజలు విశ్వసించారు. నోట్ల రద్దు వల్ల పెద్ద లాభం కనిపించకపోయినా.. అవినీతి మీద చిత్తశుద్ధితో పోరాడే నేతగా మోదీని వారు భావించారు. వంశపారంపర్య రాజకీయాలు లేకపోవటం, సొంత ఆస్తులు పోగేసుకోకపోవటం, బలమైన ఆధారాలున్న అవినీతి ఆరోపణలు రాకపోవటం వంటి అంశాలు మోదీకి కలిసివచ్చాయి. డీమానిటైజేషన్ విషయంలో జరిగిన తప్పిదాల్ని, మోదీ అవగాహనారాహిత్యాన్ని ఎండగట్టటంలో ప్రతిపక్షాలు ఘోరంగా విఫలమయ్యాయి. డీమానిటైజేషన్ వల్ల నల్లధనం పోదని, నల్లధనం, దాన్ని అల్లుకుని ఉన్న అవినీతి పోవాలంటే.. రియల్ ఎస్టేట్ రంగంలో పన్ను సంస్కరణలు, అవినీతి నిరోధక చట్టంలో పటిష్ట మార్పులు, పన్నులకు తగ్గ సేవలందించటంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసేవల చట్టం, దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఎన్నికల సంస్కరణలు రావాలని లోక్‌సత్తా కోడై కూసినా ప్రతిపక్షాలు పట్టించుకోలేదు. డీమానిటైజేషన్‌కి కొనసాగింపుగా రావాల్సిన ఎన్నికల, పన్ను సంస్కరణలపై పార్లమెంటులో చర్చించాలన్న విజ్ఞప్తుల్ని బేఖాతరు చేశాయి. కాంగ్రెస్, వామపక్షాలు సహా దాదాపు అన్ని పార్టీలూ పెద్ద నోట్ల రద్దుపై పార్లమెంటులో రచ్చను మార్గంగా ఎంచుకున్నాయితప్ప చర్చ చేయలేదు. ఇది అంతిమంగా మోదీకి వరంగా మారింది. ప్రతిపక్షాలు ఇదే తప్పిదాన్ని యూపీ ఎన్నికల్లో కూడా చేశాయి. డీమానిటైజేషన్ విషయంలో తప్పిదాల్ని సాక్ష్యాధారాలతో, హేతుబద్ధంగా ఎన్నికల్లో వివరించి ఉంటే కచ్చితంగా మోదీపై పలువురు మధ్యతరగతివారిలో అభిప్రాయం మారి ఉండేది. బీజేపీ తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్న పంజాబ్, గోవా వంటి చోట మోదీ ప్రభావం కూడా ఓటమిని ఆపలేకపోయిందని గుర్తించాలి. ప్రతిపక్షాల అనైక్యత, అసమర్థత, డీమానిటైజేషన్ వల్ల కొన్ని విపక్ష శక్తులకు నగదు కొరత.. మోదీకి యూపీ ఎన్నికల్లో బాగా కలిసివచ్చాయి. స్థానికంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకపోయినా, ప్రత్యర్థి పక్షంలో అఖిలేస్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉండాలనుకునేవారు పెద్దసంఖ్యలో ఉన్నా కూడా.. చివరికి మోదీ అవినీతిరహిత నాయకత్వానికే యూపీ ప్రజలు మొగ్గుచూపారు. బీజేపీ కుల, మత రాజకీయం యాదవేతర ఓబీసీలు, జాతవేతర దళితులను హిందూత్వం పరిధిలో ఏకం చేసింది. రాష్ట్ర జనాభాలో 20శాతం దాకా ఉన్న ముస్లింలకు ఒక్క టికెట్ కూడా కేటాయించకుండా తన హిందూత్వ ఛత్రం ఫార్ములాను చాలా విస్పష్టంగా ప్రజలకు ప్రదర్శించింది. ముస్లింల ఓట్ల కోసం సెక్యులరిజం ముసుగులో కొట్టుకున్న ప్రతిపక్షాలు ఆ ఓట్లు చీలిపోయి నష్టపోయాయి. అసమానతల కులాల్ని కలిపే హిందూత్వ ఎన్నికల ఫార్ములాను మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా నైపుణ్యంతో ప్రయోగించి విజయం సాధించగలిగారు. ఈ ఫార్ములాలోనే ఇమడాలని మిగిలిన (మైనారిటీ) మతాలన్నిటికీ సంకేతం ఇచ్చారు.

## 55శాతం మంది ఓటర్లు డబ్బు ముట్టినట్టు చెప్పారు!

పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్)తో నల్లడబ్బుకు కళ్లెం పడిందని నమ్మినవారికి షాకింగ్ న్యూస్‌ని ఓ అధ్యయనం ధృవీకరించింది. 2016 నవంబర్ 8న డీమానిటైజేషన్‌ని ప్రకటించగా, 2017 ఫిబ్రవరి-మార్చిలో జరిగిన ఉత్తర ప్రదేశ్ ఎన్నికలలో ప్రధాన పార్టీలు రూ.5,500కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు వెల్లడించింది. ఈ డబ్బులో అధికారికంగా పట్టుబడింది మాత్రం కేవలం రూ.200 కోట్లు.

దాదాపు మూడొంతుల మంది ఓటర్లను డబ్బు లేదా మద్యంతో ప్రలోభపెట్టినట్టు అధ్యయనం తెలిపింది. యూపీలో ఒక్కొక్క ఓటుకు దాదాపు రూ.750 ఖర్చు చేశారని, దేశంలోనే ఇదో రికార్డని పేర్కొంది.

ఎన్నికలకు ముందు-తర్వాత సీఎంఎస్ నిర్వహించిన ఈ అధ్యయనంలో అనేక అంశాలు బహిర్గతమయ్యాయి. సంప్రదించిన ఓటర్లలో దాదాపు 55శాతం మంది.. తమకు తెలిసినవారు లేదా ఇరుగు పొరుగు వారి నుంచి డబ్బులు ముట్టినట్టు తెలిపారు. ఆశ్చర్యకరంగా పెద్ద నోట్ల రద్దు ఎన్నికల వ్యయాన్ని పెంచినట్టు అధ్యయనంలో తేలింది. పోటీ తీవ్రంగా ఉన్న కొన్ని నియోజకవర్గాలలో కొందరు ఓటర్లకు రూ.2000 వరకు పంపిణీ చేసినట్టు బైటపడింది.

అధ్యయనంలోని ముఖ్యాంశాలు: + పోలింగ్ తేదీకి కొద్దిరోజుల ముందు 34శాతం మంది ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేశారు. + అనుకూలంగా ఓటేసేలా.. డబ్బులు, కానుకలు ప్రభావితం చేస్తాయని 10శాతం మంది భావిస్తున్నారు. + ఈసారి మద్యం కోసం ఎక్కువగా ఖర్చు చేసినట్టు 12శాతం మంది ఓటర్లు తెలిపారు. + ఓటుకు డబ్బులు తీసుకోవటం అక్రమమని నాలుగింట మూడొంతుల మందికి తెలుసు. + మూడింట ఒక వంతు మందికి ఇది కేసు పెట్టదగిన నేరమని తెలుసు.

## 'కులాల హిందూత్వ' ఛత్రంలో కులాలకతీతంగా నెగ్గటమా?

కులాలకతీతంగా అభివృద్ధి నినాదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వినిపించటం వల్లే ఎన్నికల గతి మారిపోయిందని, ఇది భవిష్యత్తు రాజకీయమని అనుకూల శక్తులు వాదిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కులసమీకరణలను దాటి ఇలా కులాలకతీతంగా కూడా ఓట్లు పొందేందుకు మోదీ ప్రయత్నించారనటంలో సందేహం లేదు. కానీ కులాల సమాహారమైన హిందూత్వ

చట్రంలోనే కులాలకతీతంగా ఎన్నికలలో నెగ్గటమా? అనే అతి పెద్ద వైరుధ్యం మోదీ ముందు కొరకరాని కొయ్యలా ఉంది. ప్రతి కులాన్నీ మైనారిటీగా విభజించి, 'కులాలకతీత హిందూత్వ' బ్రాండ్ వేసి, దేశవ్యాప్తం చేసే లక్ష్యంతో ఆదిత్యనాథ్ వంటివారిని ఎంపిక చేయటం బీజేపీకి ఎంత కాలం ఫలితాలనిచ్చినా.. ముమ్ముందు అందులోని అసమాన దొంతరల కుల వైరుధ్యం ఓ పెద్ద ప్రశ్నగా సవాలు చేస్తుందనటంలో సందేహం లేదు. అసంఘటిత రంగాన్ని సంఘటితం చేయటానికి బదులు.. మాంసంపై దాడుల పేరుతో మరింత దెబ్బతీయటం వంటి చర్యలు కొనసాగితే, ఈ సవాలును త్వరగానే ఎదుర్కోవలసి రావచ్చు. ఛాందస ధోరణుల్ని అనుమతించే హిందూత్వకు, భారతీయానికి మధ్యనున్న తేడాని మళ్లీ రీడిస్కవర్ చేస్తారా, ఈలోగానే హిందూత్వను భారతీయంగా విస్తరిస్తారా అనేది వేచి చూడాల్సిన ప్రశ్నలే.

### దేశం కోసం పనిచేసేందుకు సమర్థ యువత ముందుకు రాకుంటే.. యోగిలాంటి వారిని ఎంతని తప్పుపట్టగలం?

యూపీ గెలుపు మోదీకి కేంద్రంలో పెద్ద బలాన్ని అందివ్వటంతోపాటు తన ఎజెండాను విస్తరించుకోవటానికి పెద్ద అవకాశాన్ని కూడా కల్పించాయనటంలో సందేహం లేదు. యోగి ఆదిత్యనాథ్ యూపీ ఎన్నికల్లో గెలుపు కోసం నిర్విరామంగా కష్టపడ్డారు కాబట్టి ముఖ్యమంత్రి స్థానానికి ఎంపిక చేసినట్టు బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన మార్చి 19, 2017కు ముందు రోజు వరకూ తాను ముఖ్యమంత్రినని తెలియదని ఆదిత్యనాథ్ చెప్పినా, ఆయన ఆ పీఠాన్ని ఆశించి చాలా గ్రౌండ్ వర్క్ చేశారనటంలో సందేహం లేదు. ఆయన ఆధ్వర్యంలోని హిందూ యువ వాహిని అండ లేకుండా అక్కడ బీజేపీ గట్టెక్కే పరిస్థితి లేదు. దాదాపు 100 స్థానాల్లో యోగి అభ్యర్థులున్నారు. దాంతో ఆయన ఎంపికకు గట్టి పునాది ఏర్పడింది. అదీగాక, బీజేపీ హిందూత్వ వ్యూహంలో ఆయన బలమైన పావు. ఎన్నికలలో యోగిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించటానికి, కనీసం ఆయనతో కలిసి ప్రచారంలో వేదికను పంచుకోవటానికి సాహసం కూడా చేయలేని మోదీ.. ఫలితాలు చూశాక ధైర్యంగా ఆ పనిచేశారు. పార్లమెంటు సభ్యుడనే సంశయం కూడా లేకుండా నామినేట్ చేశారు. కానీ ఈ పరిస్థితిని ఓ పరిమితి దాటి తప్పుపట్టలేం. యోగిలాగా యవ్వనంలో జీవితాన్ని దేశం కోసం, సమాజం కోసం అందిచ్చేవారు ప్రధాన స్రవంతి యువతలో కరువవటం కూడా ఇక్కడ మనం అంగీకరించాలి. పెళ్లి చేసుకోకుండా, కాషాయం ధరించినవారు మాత్రమే ఇలా దేశం కోసం పనిచేయగలుగుతారనుకుంటే.. అలాంటివారికే దేశంలో అత్యధికంగా ఉన్న సామాన్య ప్రజలు హీరో వర్షిప్‌తో అధికారం అప్పచెప్పే ప్రయత్నం చేస్తారు. నమ్మి అధికారమిస్తే ఆధునికత, సంక్షేమం పేరుతో దశాబ్దాలపాటు నాయకులు చేసిన దోపిడీని, దగాని అనుభవించిన ప్రజలకు ఈ కాషాయ బ్రహ్మచారులు అందివచ్చిన ఓ అవకాశంలా కనిపించటంలో ఆశ్చర్యం లేదు. దేశం కోసం సమయమిచ్చే సమర్థులు, నిజాయతీపరులైన యువతను తయారుచేయటంలో సిద్ధాంతాలున్నాయని చెప్పుకునే పార్టీలు కూడా విఫలమవటం, పౌరసమాజంలో కూడా ఒడ్డున కూర్చుని గడ్డలేసేవారు తప్ప మార్పు కోసం ప్రయత్నించేవారి సంఖ్య తక్కువగా ఉండటం యోగిలాంటి వారికి బాగా కలిసొచ్చింది. ఇలాంటివారు కాకుంటే.. మన పనిముట్ల చేతిలో మనం పనిముట్లుగా మారి రోబోలను ఎన్నుకోవటం తప్ప మార్గం లేనట్టు పరిస్థితి తయారవుతోంది.

### మోదీని వ్యతిరేకిస్తే లాభం లేదు.. ప్రత్యామ్నాయ 'బిగ్ పిక్చర్'ని ప్రజల ముందుంచాలి

యోగి ముఖ్యమంత్రి పీఠాధిపత్యం వల్ల దేశానికి జరిగే నష్టమేదైనా ఉందని భావించే పక్షాలన్నీ ముందు ఈ పరిస్థితుల్ని చక్కదిద్దటం మీద దృష్టిపెట్టాలి. మోదీని గుడ్డిగా వ్యతిరేకించటం వల్ల కాకుండా.. మౌలికంగా ఇలాంటి మార్పులతో కూడిన 'బిగ్ పిక్చర్'తో వస్తే తప్ప మోదీకి దీటుగా వ్యవహరించటం సాధ్యం కాదని వీరంతా గుర్తించాలి. జన జీవితాల్ని నిజంగా మార్చగలిగే బిగ్ పిక్చర్‌లో మోదీ అల్పత్వాన్ని ప్రజల ముందు ప్రదర్శించనంతవరకూ మోదీ మహాబలుడిలాగానే కనిపిస్తారు. అలాగే ప్రధానమంత్రి కూడా తన విజయం వెనక ఉన్న రాజకీయ, పాలనా వైఫల్యాలను సరిదిద్దే ప్రయత్నం చేయకుండా ప్రతిపక్షాల వైఫల్యం మీదే ఆధారపడితే ... ఏదోకరోజు వైరుధ్యాల బారినపడి ఓటమి పాలవ్వాల్సి వస్తుంది. తమ కోసం ఎవరైనా దైవదూత దిగిరావాలని, హీరోలాగా తమల్ని కాపాడాలని, తమ జీవితాల్ని ఓ రేంజ్‌కి తీసుకెళ్లాలని కోరుకునే సగటు భారతీయ ప్రజల మనస్తత్వానికి మోదీ ఒక ఆశాకిరణంలా కనిపిస్తున్నారు. నాయకుడి బాధ్యత కేవలం ఒక మార్గం చూపటం, వేదిక నిర్మించటం, ప్రచారం చేయటం మాత్రమేనని.. వ్యవస్థల ఏర్పాటు, ప్రజల భాగస్వామ్యం లేకుండా ఒక వ్యక్తి చుట్టూ తిరిగే మార్పు ఎప్పుడోకప్పుడు కూలిపోక తప్పదని మోదీ బిగ్ పిక్చర్‌ని ముందుగానే గుర్తిస్తే ఆయనకు, ఆయన పార్టీకి, దేశానికి కూడా ఎక్కువ మేలు జరుగుతుంది. ఏతావాతా, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలందించే పౌర సేవల చట్టం, అదనపు ఓట్ల కోసం కోట్లు వెదజల్లే విధానం నుంచి బైటపడేందుకు దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక ప్రభుత్వాల సాధికారత, పోలీసు, న్యాయ సంస్కరణలు, ఏ కులంలో, మతంలో పుట్టినా అందరితో సమానంగా ఎదుగుతామనే భరోసా ఇచ్చే నాణ్యమైన విద్య, వైద్యాలను అందించటం.. ఇవి మాత్రమే ఇప్పుడు అధికార, ప్రతిపక్షాలు, సమాజం ముందున్న తక్షణ కర్తవ్యం. *

# త్వరపడితేనే.. ఇల్లు చక్కదిద్దుకోగలం!

- డా॥ జయప్రకాష్ నారాయణ్

సాంకేతిక, ఆర్థిక విప్లవాల సమయంలో భారతదేశ గణతంత్ర వ్యవస్థ నిర్మాణం జరగటమనే యాదృచ్ఛిక అంశాన్ని మినహాయిస్తే.. భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సమస్యలు అసాధారణ కోవలోనివే. పారిశ్రామిక విప్లవం కాలంలో బ్రిటన్ సరాసరిన 1 నుండి 2శాతం వార్షిక వృద్ధి రేటుని నమోదుచేసింది. శతాబ్దాల ఆర్థిక ప్రతిష్ఠంభన తర్వాత ఆ మాత్రం స్థిరమైన అభివృద్ధి రేటుని సాధించటాన్ని ఓ అద్భుతంగానే చూశారు. కానీ ఈవేళ భారత్‌లో 5-6 శాతం వృద్ధిరేటుని సాధించటాన్ని ఒక వైఫల్యంగా చూస్తున్నారు. వ్యవస్థల్ని మెరుగు పరుచుకుని ఎప్పటికప్పుడు సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవటానికి పరిణతి చెందిన అనేక ప్రజాస్వామ్య దేశాలకు దశాబ్దాల, శతాబ్దాల సమయం లభించింది. కానీ వేగంగా మారుతున్న ప్రపంచంలో భారత్‌కు ఈవేళ అలాంటి వెసులుబాటు లేదనేది స్పష్టం. కాబట్టి, మన ప్రజాస్వామ్యం విఫలం కాకపోయినా ఎందుకు వేళ్లూనుకోలేదు అని సమీక్షించుకోవాలి. ఇటీవలి దశాబ్దాలలో భారతదేశంలో రాజకీయ, పాలనా సంక్షోభాలకు దారితీసిన లోతైన వ్యవస్థీకృత విషయాలు ఉన్నాయన్నది సుస్పష్టం. గత ఏడు దశాబ్దాల పాఠాల్ని మనం వేగంగా అంతర్గతం చేసుకుని అవలక్షణాల్ని త్వరితంగా సరిచేసుకోవాలి.

మన సంక్షోభాన్ని పరిష్కరించుకోవటానికి.. ప్రజాస్వామ్యం, అందరికీ వయోజన ఓటుహక్కులను భారత్‌లో వ్యవస్థీకృతంగా అమలులోకి తెచ్చినప్పటి నాటి అసాధారణ పరిస్థితులను ముందు లోతుగా పరిశీలించాలి. తొలినాడున్న పరిస్థితులలో మూడు కీలకమైన వాటిని దిద్దుకోకపోతే మున్ముందు విషాదకర



పరిణామాలు సంభవిస్తాయి. మొదటిది, వలసవాద పాలనలో మగ్గిన ప్రజలకు, సర్వాధికారాలను చెలాయిస్తున్న అధికారగణానికి మధ్య అసంబద్ధ అధికార విభజన.

మన ప్రభుత్వోద్యోగులకు (ప్రజాసేవకులకు) వ్యవస్థ ఎప్పుడూ సేవాతత్పరతను, వినమ్రతను ఎప్పుడూ బోధించలేదు. దీనివల్ల.. పన్నులు చెల్లించే ప్రజలకు సేవలందించే వ్యక్తులుగా వారు తమని తాము ఎప్పుడూ భావించలేదు. ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా ఉండాల్సిన ప్రజలలో అనేకమంది కంటే, ఈ ప్రభుత్వోద్యోగులలో అట్టడుగున ఉండే వ్యక్తి కూడా ఆర్థికంగా చాలా భద్రతతో, శక్తిమంతంగా ప్రభావం చూపుతూ ఉంటాడు. ఇటువంటి వాతావరణంలో, జనన ధృవపత్రం, భూమి రికార్డు లేదా నీరు, విద్యుత్ కనెక్షన్ వంటి చిన్నపాటి సేవని పొందటం కూడా పౌరులకు అలవికాని పనిగా, చాలా పెద్ద సమస్యగా మారుతుంది. ఉద్యోగుల అర్థంలేని నిబంధనలు, లంచాలు, వేధింపులు, ఆలస్యాలు లేకుండా, పైరవీలు చేయకుండా, సిఫార్సు కోసం పెద్దవాళ్ళుగా ముద్రపడినవారి చుట్టూ తిరగకుండా దాదాపుగా ఏ పనీ జరగదు. కొన్ని వర్గాల ప్రజలలో అక్షరాస్యత, ఆర్థిక స్థాయి కొంత పెరగటం, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో సేవలు అందించటం కొంత మెరుగుపడింది. కానీ ఈవేళ్టికి కూడా ఎక్కువమంది ప్రజలకు రోజువారీ అవసరాలైన సేవల కోసం, సౌకర్యాల కోసం లంచాలు, సిఫార్సులు మీద ఆధారపడక తప్పటం లేదు. ప్రతి పనిలో రాజ్యవ్యవస్థ జోక్యం చేసుకునే సోషలిస్టు కాలంలో ఈ నిస్సహాయ, ఆధారపడే ధోరణులు ప్రస్ఫుటంగా పెరిగాయి. రేషన్ కార్డు, పంచదార, కిరోసిన్, సిమెంట్, టెలిఫోన్, విద్యుత్ కనెక్షన్ - ఇలా ప్రతి పనికీ పౌరులు పాలకుల వద్దకు వెళ్లి అర్థించాల్సిన పరిస్థితి వచ్చింది. రాజ్యవ్యవస్థ గుత్తాధిపత్యానికి అసమర్థత, అవినీతి తోడవటంతో ప్రభుత్వోద్యోగులు వలసపాలనలో కంటే మరింత శక్తిమంతులుగా, జవాబుదారీతనం లేనివారుగా తయారయ్యారు. సాంకేతికత పెరిగి సేవలు కొంత మెరుగ్గా అందుబాటులోకి వస్తున్నా.. దోపిడీ, వేధింపులు మాత్రం ఆగలేదు. మౌలిక సంక్షోభం అలాగే కొనసాగుతోంది.

ఇక సమస్యలో భాగంగా ఉన్న రెండో అంశం - పౌరసత్వ భావన లోపించటం! శతాబ్దాల అణచివేత తర్వాత మనదేశంలో చాలామంది ప్రజలు తమను తాము పాలితులుగా భావిస్తున్నారే తప్ప, పౌరులుగా భావించుకోవటం లేదు. ప్రజాస్వామ్య భారతదేశంలో అందరికీ వయోజన ఓటుహక్కు, స్వేచ్ఛ వాస్తవరూపం దాల్చినా, అప్పటికే ఉన్న పాలన, అధికారం అనే భావనల మీదే వాటిని రుద్దారు. అప్పటివరకు వారసత్వంగా వస్తున్న మహారాజులు, వలసవాద పాలకులు ఎలాగైతే ప్రశ్నించవీలులేని పాలకులుగా కొనసాగారో, వలసానంతర స్వతంత్ర భారతదేశంలో ఎన్నికైన నేతలు, ఉన్నతాధికారులు కూడా అలా నూతన 'చక్రవర్తులు'గా తయారయ్యారు. గతకాలంలో, చక్రవర్తి మాటే శాసనంగా

## తెలంగాణ ప్రభుత్వానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా పంపిన 'పౌర సేవల' నమూనా చట్టంలోని ముఖ్యాంశాలు

తెలంగాణ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా నిర్ణీత గడువులోగా హక్కుగా పనులు జరిగేందుకు పౌర సేవల చట్టం తెస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు చేసిన ప్రకటనను జేపీ స్వాగతించారు. 1998 నుంచి ఈ చట్టం కోసం కృషి చేస్తున్న ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఇప్పటికే రూపొందించిన 'హక్కుగా పౌరసేవల' బిల్లును వినియోగించుకోవాలని లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వానికి జేపీ పంపిన నమూనా చట్టంలోని 5 ముఖ్యాంశాలివి:

**1) అన్ని ప్రజాసేవలకు చట్టబద్ధ గ్యారంటీ ఉన్న సిటిజన్స్ ఛార్టర్ల ఏర్పాటు:** ప్రతి రాష్ట్ర ప్రభుత్వ అథారిటీ/సంస్థ తాను అందించే వస్తువులు-సేవలు, బాధ్యులైన అధికారుల పేర్లు ఉన్న జాబితాతో పాటు సిటిజన్స్ ఛార్టర్లను రూపొందించి ప్రకటించాలి. ప్రజలు దరఖాస్తు చేసిన ప్రతి పనిని పూర్తి చేయటానికి నిర్ణీత కాలవ్యవధిని పేర్కొనాలి. ఆలస్యం జరిగినా, ఆ పనిచేయటం సాధ్యం కాదన్నా ఫిర్యాదు చేసుకోవటానికి పటిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. అలాగే ఎల్లకాలం పాత ఛార్టర్లనే కొనసాగించకుండా.. నిర్ణీత కాలవ్యవధిలో సిటిజన్స్ ఛార్టర్లను సమీక్షిస్తూ అప్‌డేట్ చేస్తుండాలి.

**2) ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కార యంత్రాంగం:** ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి యంత్రాంగంలో భాగంగా ప్రతి ప్రభుత్వ సంస్థ సమాచార, సహాయ కేంద్రాలను, వినియోగదారుల హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి.

దీంతోపాటు పౌరుల నుంచి ఫిర్యాదులు తీసుకుని, విచారణ చేసి పరిష్కరించేందుకు తగినంతమంది అధికారులను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదులపై ఇప్పుడు జరుగుతున్నట్టు వ్యాజ్యాల పేరుతో బోలెడంత సమయం, డబ్బు వృథా కాకుండా ఈ చట్టంలో నిర్ణీత గడువులోగా పరిష్కరించే ఏర్పాటు ఉంటుంది. ఉద్యోగి వల్ల తప్పు జరిగి ప్రజలకు సేవ అందలేదనో, జాప్యం జరిగిందనో నిర్ధారించుకుంటే.. జరిమానా, పరిహారంపై స్వతంత్ర అప్పీలేట్ అథారిటీకి పరిష్కార యంత్రాంగం అధికారి సిఫార్సు చేస్తారు.

**3) పరిష్కార యంత్రాంగం నిర్ణయంపై కూడా అప్పీలుకు అవకాశం:** తన ఫిర్యాదుపై విచారణ సక్రమంగా జరగలేదని పౌరుడు/పౌరురాలు భావించినప్పుడు ముప్పై రోజుల గడువులోగా స్వతంత్ర నిర్దేశిత అథారిటీ (ఐడీఏ)కి అప్పీలు చేయవచ్చు. కార్పొరేషన్/జిల్లా స్థాయిలో ఇది మొదటి అప్పీలేట్ అథారిటీ. ముప్పై రోజులలోగా ఐడీఏ ఈ అప్పీలును పరిష్కరించాలి.

ఆ తర్వాత కూడా పౌరుడు/పౌరురాలికి అసంతృప్తి ఉంటే లోకాయుక్త వద్ద రెండవ అప్పీలును దాఖలు చేయవచ్చు. బిల్లులో లోకాయుక్త అత్యున్నత అప్పీలేట్ అథారిటీగా ఉంటుంది.

**4) జరిమానా, పరిహారం చెల్లింపు విధానం:** దరఖాస్తు చేసుకున్నవారికి సకాలంలో వస్తువులు, సేవలు అందించకుండా విధి నిర్వహణలో తప్పు చేసిన ప్రభుత్వోద్యోగి, ఫిర్యాదు పరిష్కార యంత్రాంగ అధికారి మీద జరిమానా విధించే అధికారాన్ని ముసాయిదా బిల్లు ఐడీఏ, లోకాయుక్తకి కల్పిస్తోంది. సంబంధిత అధికారిపై ఎంత జరిమానా విధిస్తారో అంత మొత్తాన్నీ బాధితునికి చెల్లించాలి. జరిమానా, పరిహారాలకు పరిష్కార యంత్రాంగం చేసిన సిఫార్సులను కూడా పరిశీలించి అప్పీలేట్ అథారిటీ పరిధిలో ధృవీకరిస్తారు.

**5) నిరూపించాల్సిన బాధ్యత అధికారిదే:** ఫిర్యాదు పరిష్కరించాల్సినది కాదని నిరూపించాల్సి వస్తే ఆ బాధ్యత దరఖాస్తుదారుని మీద కాకుండా ఫిర్యాదు పరిష్కార అధికారి మీదే ఉంటుంది.

చెలామణి అవుతూ, అతనికి పూర్తిగా తలొగ్గి శరణు మహాప్రభో అంటే ఎలాగైతే భద్రత ఉండేదో, అలాగే ఎన్నికైన మహారాజులు కూడా 'ఎలాగోలా' జనం అవసరాల్ని, అంచనాల్ని నెరవేరుస్తుంటారు. మనం చెల్లించే పన్నులు, మనకు లభిస్తున్న సేవలకు మధ్య సంబంధం ఉందని, ప్రజాధనం ప్రజల అవసరాలకు, వారి సేవలకోసమే ఉందని మనల్ని ఎప్పుడూ గుర్తించనీయటం లేదు. 'ఎన్నికలు'గా పిలవబడే ఒక మేజికల్ ప్రక్రియ ద్వారా, 'బ్యాలెట్ పెట్టె' ద్వారా మన ఓటు ద్వారా కొత్త మహారాజులు ఎన్నికవుతున్నారు. ఈ చట్టసభ సభ్యులు, వారి పార్టీ కార్యకర్తలు 'ఏదోక రకంగా' మనకవసరమైన ప్రతిదీ సమకూరుస్తారు. ఇటువంటి వాతావరణంలో చట్టబద్ధ పాలన అనే భావన, నిర్దేశిత ప్రక్రియ వేళ్లూను కోవటానికి అవకాశం ఉండదు. అధికారంలో ఉన్నవారితో, ముఖ్యంగా మీ ఓటును అడిగిన చట్టసభ సభ్యునితో, మీకుండే సంబంధాలతోనే ప్రతిదీ ముడిపడి ఉంటుంది. కాబట్టి, మీ గురించి పట్టించుకోకుండా, కోపతాపా లతో చిందులేసే అధికారి కంటే ఆ చట్టసభ సభ్యుడు మీకు ఎక్కువ అందుబాటులో,

ఎక్కువ సాన్నిహిత్యంతో ఉన్నట్టు అనిపిస్తాడు.

సక్రమంగా పనిచేయకుండా, ప్రజలతో సుహృద్భావంగా, సహకార ధోరణితో వ్యవహరించకుండా ఉన్న వ్యవస్థలో ఎన్నికైన చట్టసభ ప్రతినిధి మీద, పార్టీ కార్యకర్తల మీద మితిమీరి ఆధారపడటం అనేది వారి మీద విపరీతమైన భారాన్ని మోపుతోంది. ప్రజల అవసరాల్ని, సమస్యల్ని చూసేందుకు పెద్దఎత్తున పార్టీ అధికారయంత్రాంగమొకదాన్ని నిర్మించాల్సివస్తోంది. స్వతంత్ర పోరాటకాలంలో అనేకానేకమంది ప్రజలు తమ సమయాన్ని, శక్తిని, వనరుల్ని స్వచ్ఛందంగా దేశసేవ కోసం వెచ్చించారు. స్వతంత్ర పోరాటం పట్ల ఉత్తేజపూరిత ఆకర్షణీయ భావన, ఆరాధనాభావంతో కూడిన దేశభక్తి, ఎదుగూబదుగూలేని వ్యవసాయార్థిక వ్యవస్థలో చెప్పుకోదగిన కెరీర్ అవకాశాలు లేకపోవటం వల్ల అటువంటి త్యాగం మోయలేని బరువుగా, పెద్దబాధగా అనిపించలేదు. కానీ, ఒక స్వతంత్ర రిపబ్లిక్‌లో ఏరోజుకారోజు అన్నట్టుండే పోటీసేవల ప్రపంచంలో అదేతరహా త్యాగాన్ని ఆశించటం అవాస్తవిక మవుతుంది. కొత్తగా ఆవిర్భవిస్తున్న లైసెన్స్ రాజ్యంలో అనేకమంది అక్రమార్జనాపరులవుతున్న దశలో ఇది మరీ వాస్తవం. ఒకమేరకఆర్థికాభివృద్ధికి దారితీస్తున్న దశలో కెరీర్‌ని వదులుకోవటం ద్వారా జారవిడుచుకుంటున్న అవకాశానికి భారీ మూల్యమే చెల్లించాలి. అటువంటి త్యాగం ఎంతమాత్రం ఆచరణయోగ్యం కానిది. రాజ్యవ్యవస్థ అధికారం, వనరులపై కొత్తగా అందివచ్చిన అధికారం, లైసెన్స్-పర్మిట్ రాజ్యంలోని మార్కెట్ అనుకూలతలు - సొంత ఆర్థికవనరుల్ని పోగేసుకోవటానికి ఎన్నికైన చట్టసభ ప్రతినిధులకు అనేక అవకాశాల్ని కల్పించాయి. స్వతంత్ర పోరాటకాలం నాటి త్యాగం, నైతికత వంటి విలువలకు కట్టుబడి ఉన్న చట్టసభ సభ్యులు కాలక్రమంలో పరిమితమై పోవటమో లేదా రాజకీయాల్ని వదిలివెళ్లి పోవటమో జరిగింది. అధికార దుర్వినియోగం, అవినీతి, రాజు - సేవకుడు లెక్కన రాజకీయాలు, సహాయాలు అందించటం ఏళ్లతరబడి వ్యవస్థీకృతమయ్యాయి. రాజకీయాన్ని నడపటానికి, ఎన్నికలలో నెగ్గటానికి విపరీతమయిన అక్రమార్జన అవసరమయ్యే వాతావరణం సర్వత్రా వ్యాపించింది. దాంతో ప్రజాస్వామ్యం ధనికస్వామ్యంగా, దోపిడీ రాజ్యంగా రూపాంతరం చెందింది. లైసెన్స్-పర్మిట్ వ్యవస్థను కొంతమేర ధ్వంసం చేసినప్పటికీ, పేదలకు, మరీ అంత పేదలుకానివారికి వ్యక్తిగతంగా లబ్ధిని నేరుగా అందచేసే తాత్కాలిక ఉపశమనాల సంస్కృతి వల్ల రాజు - సేవకుడు తరహా రాజకీయ నెట్‌వర్క్‌లు యధావిధిగానే కొనసాగే అవకాశం లభించింది.

ఇలా రాజకీయ కార్యకర్తల ద్వారా ప్రభుత్వ సేవలను అందించటం వల్ల రెండు సమస్యలు ఉన్నాయి. మొదటిది, అధికార యంత్రాంగాన్ని మరింత సమర్థవంతంగా, ప్రభావశీలంగా, జవాబుదారీతనంగా తయారుచేసేందుకు ఎటువంటి ప్రయత్నమూ ఉండదు. దీంతో, చట్టసభ ప్రతినిధులు, పార్టీ క్యాడర్లు ఒళ్లు హూనమయ్యేలా ప్రయత్నాలు చేసినా కూడా పౌరసేవల్ని అరకొరగా, చాలా అసంతృప్తంగా మాత్రమే అందించ గలిగారు. ఇది ప్రజలలో అసంతృప్తిని ఇంకా పెంచి, ఎన్నికల సమయంలో ఓటర్లు మరింత ఆగ్రహంతో రగిలిపోతూ తిరస్కారభావంతో వ్యవహరించేలా చేసింది. రెండోది, భయంకరమైన అవినీతి, అధికార దుర్వినియోగంతో వ్యవస్థ నిండిఉంది. నిరంతరం ప్రజలకి ఎంతోకొంత అందుబాటులో ఉండే వేలాది కార్యకర్తలని పోషించాలంటే కోట్ల ఖర్చు అవసరం. అందుకు అవినీతి, అధికార దుర్వినియోగం అనివార్యమయి పోయినాయి. బదిలీలు, నియామకాలు, లైసెన్సులు, పర్మిట్లు, కాంట్రాక్టులు, టెండర్లు, భూకేటాయింపులు, గనులు, పోలీసు కేసులు, పైళ్ల కదలిక - ఇలా అన్నీ అవినీతితో తడిపితేనే సాధ్యమవుతాయి. దీనివల్ల మళ్లీ రాజకీయ నేత, అధికారి నైతికతని, విశ్వసనీయతని కోల్పోయారు. రాజకీయవేత్తలు, వ్యవస్థ పట్ల ప్రజలు మరింత అపనమ్మకంతో వ్యవహరిస్తున్నారు.

మూడో అవలక్షణం అధికారాన్ని కేంద్రీకరించటం. నిర్ణయాల ప్రక్రియలో స్థానిక వర్గాలను భాగస్వాముల్ని చేయటానికి అర్థమనస్కంగా కొన్ని ప్రయత్నాల్ని చేసినా, స్వతంత్రానంతర భారతదేశంలో స్థానిక చొరవ, సాధికారత లేని విపరీత కేంద్రీకృత పాలనే ఉంది. పన్నులకు, సేవలకు మధ్య సంబంధం లేదు. కేంద్రీకృత రాజ్యంలో పాలకుల ఆదరణ, సద్భావన మీదే ఆధారపడి అంతా నడుస్తుంటుంది. ఓటుకి, ప్రజాప్రయోజనానికి సంబంధం ఉండదు. స్పందనలు, సరళత్వం కనిపించని కేంద్రీకృత వ్యవస్థలో ఎవరు ఎన్నికవుతారన్నది పెద్ద అంశం కూడా కాదు. అలాంటి ఎన్నికల వల్ల వాస్తవంగా పెద్దమార్పులేవీ కూడా రావు. దీంతో, ఓటుకి మంచిని సాధించే విలువ లేకుండా పోయింది. పరిపాలనకు బాధ్యతతో సంబంధం లేకుండా పోయింది. ఫలితంగా, అందరూ ఉండాల్సిన చోటే ఉంటూ చేయాల్సిన పనే చేస్తున్నట్టు అనిపిస్తున్నా.. చాలా అంశాల్లో వైఫల్యం చెందుతూ, ఎవరూ జవాబుదారీగా ఉండని వ్యవస్థొకటి తయారైంది. స్థానిక నాయకత్వం తయారయ్యే, స్థానిక పరిష్కారాలు అమలయ్యే అవకాశాన్ని ఒక్కసారి తిరస్కరించాక, ప్రజలను గుప్పెట్లో ఉంచుకోవటానికి, వారి ఓట్లు ఆకర్షించటానికి కేంద్రీకృత ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనాలు, వనరుల్ని వృధాగా వెదజల్లటం వంటి తేలికైన మార్గాలవైపు మళ్లుతుంది. లేదా ప్రజల్ని బలప్రయోగంతో నియంత్రిస్తుంటుంది. లేదా విభేదాలు పెంచి, వైరుధ్యాల్ని రెచ్చగొట్టి, విద్వేషాలతో, ఉద్వేగాలతో రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తుంది. ఏరకంగా చూసినా కూడా, పౌరులు, ప్రజాసేవకుల పాత్ర తారుమారై,

ప్రజలు బిచ్చగాళ్లుగా తయారయ్యారు.

ఈ మూడు ప్రాథమిక పరిస్థితులు – అధ్వాన్నపు సేవలు, పౌరసత్వం లేకపోవటం, మితిమీరిన కేంద్రీకరణ – మన కళ్లముందు కనిపిస్తున్న పలు వైఫల్యాలకు దారితీశాయి. ఓటుకు నోటు ఇంకాఇంకా పెరుగుతూ, డబ్బు, మద్యంకి ఓటు వేసేలా ప్రజల్ని ప్రలోభ పెడుతున్నారు. చాలా రాష్ట్రాలలో ఒక శాసనసభ స్థానానికి గట్టి పోటీ ఇవ్వాలనుకునే ప్రధాన పార్టీ అభ్యర్థికి రూ.2 నుంచి 6 కోట్లు ఖర్చవుతుంది. అభ్యర్థులందరి వద్దా డబ్బు, ఇతర ప్రలోభాలను తీసుకునే ఓటర్ల సంఖ్య పెరుగుతోంది. బరిలో గట్టి పోటీ ఇవ్వాలంటే భారీ వ్యయం ఓ తప్పనిసరి షరతు, కానీ దాని వల్ల గెలుపు మాత్రం గ్యారంటీ కాదు. చెల్లింపు వార్తలు, ఇతర దుష్ప్రభావ చర్యలకు పాల్పడుతుండటం వల్ల ఖర్చు ఇంకా పెరిగిపోతూ, ఇంకా అవినీతికి, ఇంకా ప్రతికూల ధోరణికి, ఇంకా ఓట్ల కొనుగోలుకి దారితీస్తోంది. అత్యుత్తములు, సమర్థులు రాజకీయాలకు ఇంకాఇంకా దూరంగా వెళ్తుండగా, వారు ఎన్నికలలో గెలవలేరులే అన్నట్టు చూస్తున్నారు. ప్రధాన స్రవంతి పార్టీలన్నీ ఓట్ల కొనుగోలుకు పాల్పడుతున్నందున, ఓట్లకొనుగోలుకు పెట్టుబడి ఇంకా భారీగా అవసరమవుతోంది. ప్రభుత్వాలు తాము చేయాల్సిన కనీస, తప్పనిసరి బాధ్యతల్ని ఫణంగా పెట్టి బాధ్యతారహితమైన, పోటీపోటీ జనాకర్షక పథకాల్ని, ఎడతెగకుండా ఉచితాల్ని కొనసాగించటం ఇప్పుడో మొండిరోగంలా తయారైంది. నేరుగా, వ్యక్తిగతంగా, తాత్కాలిక లబ్ధి చేకూర్చేందుకు చట్టబద్ధ పాలనను, న్యాయాన్ని, మౌలికవసతుల్ని, కనీస సౌకర్యాల్ని, విద్యను, ఆరోగ్యాన్ని నేరసమాన నిర్లక్ష్యం చేశారు. తాత్కాలిక జనాకర్షక పథకాల ప్రయోజనాలలో చాలావరకూ తాత్కాలికమైనవి. పేదల శక్తిసామర్థ్యాలను అవి పెంచలేవు, వారికి సాధికారతను అందించలేవు. దీంతో, పేదరికం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. దాంతోపాటు, ప్రభుత్వ సేవలు విఫలమవటంతో, ప్రభుత్వ మౌలిక వసతులు, సేవలపైనే ప్రధానంగా ఆధారపడిన పేదలు చాలా తీవ్రంగా నష్టపోతున్నారు.

ఓట్ల కోసం చాలాపార్టీలు తాత్కాలిక జనాకర్షక పథకాల మార్గాన్నే ఎంచుకోవటంతో, ఆ విషయంలో అన్ని పార్టీలూ సమానంగా మారిపోయాయి. దీంతో, అసలే నిరాశానిస్పృహలతో కూడిన సమాజంలో ఎక్కడవీలుంటే అక్కడ పార్టీలు చాకచక్యంగా విభజనలు సృష్టించి, కులం, ప్రాంతం, మతం, భాషల పట్ల విధేయతల్ని రెచ్చగొట్టి ఓటు బ్యాంకుల్ని తయారుచేసుకోవటం మొదలుపెట్టాయి. ఓటుకోసం డబ్బు, ఉచితాలు, విభజనలు – ఈ మూడూ ఓటుకి, మన రాజకీయ ప్రక్రియని ఛిన్నాభిన్నం చేయటానికి, అభివృద్ధిని, సామరస్యతను దెబ్బ తీయటానికి, మన ప్రజాస్వామ్యాన్ని దిగజార్చటానికి ఉమ్మడి కరెన్సీలుగా తయారయ్యాయి.

గత అనుభవం నుంచి మనం పాఠాలు నేర్చుకుని మన వ్యవస్థల్ని బలోపేతం చేసుకుని సాధ్యమైన అత్యుత్తమ ఫలితాలను సాధించటానికి అవసరమైన చోటల్లా మన వ్యవస్థను సంస్కరించుకోవాల్సుంది. మన ఎన్నికలలో డబ్బు ప్రభావాన్ని, తాయిలాలని, సంకుచిత వాదాల ప్రభావాన్ని తగ్గించాలంటే ఓట్ల శాతానికి, లభించే సీట్లకి మధ్య లంకె ఉండే దామాషా పద్ధతి ఎన్నిక అవసరం. దామాషా ఎన్నికల పద్ధతి తగిన మార్పు, చేర్పులతో, మన అవసరాలకు తగ్గ సునిశిత రూపకల్పనతో అమలుచేస్తే మన ప్రజాస్వామ్య పునరుజ్జీవనానికి ఓ గొప్ప అవకాశాన్ని అందిస్తుంది. అయితే ఎన్నికల విధానంలో మార్పు వల్ల ఫలితం మెరుగవుతుందిగానీ, మన రాజకీయ, పాలనా సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి అదొక్కటే సరిపోదని కూడా మనం గుర్తించాలి. దామాషా ఎన్నికల విధానంతోపాటు రెండు విస్తృత ప్రభావశీలమైన, ఎంతోకాలంగా అణగదొక్కుతున్న సంస్కరణల్ని కూడా తెచ్చుకోవాలి. మొదటిది, మూడో అంచె ఫెడరలిజం కార్యరూపం దాల్చేలా స్థానిక ప్రభుత్వాలకు గణనీయంగా సాధికారతనివ్వాలి. స్థానిక స్థాయిలో జవాబుదారీతనంలో కూడిన అటువంటి సాధికారత మన ప్రజల శక్తిసామర్థ్యాలను ఆవిష్కృతం చేసి సృజనతో, స్ఫూర్తితో మన సమాజాన్ని పరివర్తింప చేయగల కొత్త నాయకత్వాన్ని తయారుచేస్తుంది. రెండోది, పోలీసు, న్యాయ సంస్కరణలతో చట్టబద్ధ పాలనను బలోపేతం చేయటం, ప్రజలు తాము పోగొట్టుకున్న గణతంత్రాన్ని తిరిగి పొందేలా – పౌరులకు ప్రభుత్వసేవల్ని నిర్ణీత కాలవ్యవధిలో ఒక హక్కుగా అందించేందుకు, ఆలస్యమైతే నష్టపరిహారాన్ని చెల్లించేందుకు – ప్రభావశీలమైన 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ/రైట్ టు సర్వీసెస్) చట్టం, అవినీతిని నిరోధించి అన్నిస్థాయిలలో అధికార దుర్వినియోగాన్ని నివారించటానికి పలు సంస్థాగత చర్యలు తీసుకోవటం సహా చర్యలతో జవాబుదారీతనాన్ని వ్యవస్థీకృతం చేయాలి.

జాతీయస్థాయిలో దశాబ్దాల తర్వాత కులం, మతం, ప్రాంతం, జనాకర్షక తాయిలాలకు అతీతంగా బీజేపీకి చెందిన నరేంద్ర మోదీ గొప్ప అవకాశం లభించిందనటంలో సందేహం లేదు. గత యూపీయే ప్రభుత్వం గొప్ప అవకాశాలు వృథా చేసుకుని కాలహరణ చేయటంతో దేశాన్ని సంక్షోభం నుంచి బయట పడెయ్యటానికి ఇప్పుడు మరీ ఎక్కువ సమయం లేదు. కానీ ముందుకొచ్చి ప్రజల విశ్వాసాన్ని పొందారు కాబట్టి ఆ సవాలును మోదీ ప్రభుత్వం స్వీకరించకతప్పదు. మార్పు కోసం చాలా అవగాహన, చాకచక్యంతో మోదీ సర్కారు వ్యవహరించాల్సి ఉంది. సమయం మించి పోతే.. కోట్లాదిమంది ప్రజలు నివారించదగ్గ బాధలతో నష్టపోతారు. భారత్‌కి మరో అవకాశం ఎప్పటికొస్తుందో ఎవరూ చెప్పలేరు! *

# యూత్‌కి ఛాలెంజ్: 70 ఏళ్ల వయసులో గద్దర్ మరోపోరాటం.. తూటా నుంచి ఓటుకి!



ఒకప్పుడు ఓటు వేయొద్దని పాట పాడిన గద్దర్.. తన పంథా మార్చుకుని ఓటు ద్వారా మెరుగైన ప్రజాస్వామ్యం కోసం పోరాటానికే ఇక తన పాట అంకితమని ప్రకటించారు. తాను ఓటుని కూడా నమోదు చేసుకున్నానని, 'పల్లె పల్లెకు పాట.. పార్లమెంట్‌కు బాట' పేరుతో ప్రజల్లో చైతన్యం తీసుకొస్తానని తెలిపారు. దక్షిణ భారతదేశంలోని 175 ప్రాంతాలను కలియతిరుగుతానని, ఆరు నెలల్లో రెండు లక్షలమందిని కలుస్తానని చెప్పారు. డబ్బున్న వారి చేతుల్లోనే దేశం ఉందని, దీన్ని మార్చటానికి తాను పార్టీ పెట్టకపోయినా భావసారూప్యత కలిగిన పార్టీలను ఏకం చేస్తానని అన్నారు. చిన్న చిన్న పార్టీలన్నీ కలిసి సమష్టి రాజకీయ పార్టీగా ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఎలాంటి తెలంగాణ కావాలన్న చర్చను ఉద్యమ సమయంలో చేయకపోవటం వల్ల నష్టం జరిగిందన్నారు. కనీసం పార్లమెంటులో బిల్లు పెట్టినప్పుడైనా తెలంగాణ ఎలా ఉండాలో అడగాల్సి ఉండేదన్నారు. ఇప్పుడు తెలంగాణలోనూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి కావాలన్నారు. తనపై కాల్పులు జరిగి 20 ఏళ్లు అయిన సందర్భంగా "శబ్దం-కవులు-కళాకారుల ఐక్యవేదిక" పాటపై తూటా పేరుతో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గద్దర్ ఈ విషయాలను ప్రకటించారు. మావోయిస్టు పార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నట్టు తెలిపారు.

మరోవైపు, అపరిపక్వ దశలో ఉన్న మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓట్ల రాజకీయాల్లోకి వచ్చి అద్భుతాలు సృష్టిస్తానన్న భ్రమలు తనకు లేవని, ఇరోం షర్మిలకు వచ్చినన్ని ఓట్లు కూడా తనకు రాకపోవచ్చని స్వయంగా ఒప్పుకున్న గద్దర్.. ఇలా పార్లమెంటరీ రాజకీయాల్లోకి రావటం పట్ల కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ఏదైనా ఎత్తుగడ ఉందని ఇంకొందరు అనుమానిస్తున్నారు. అయితే పలువురు ప్రజాస్వామ్యవాదులు మాత్రం స్వాగతిస్తున్నారు. హింస లేకుండా, అసాధ్యమైన అద్భుతాల కోసం ఎదురుచూడకుండా సుసాధ్యమైన మంచి కోసం కనీసం ప్రచారం చేసినా తెలంగాణకు, ఈ దేశానికి మంచే జరుగుతుందని వారి వాదన.

మాటకు, విధానాలకు కట్టుబడటం ఎంత ముఖ్యమో.. అంతకంటే మెరుగైన అవగాహన వచ్చినప్పుడు హేతుబద్ధంగా, పారదర్శకంగా మార్చుకునే సాహసాన్ని ప్రదర్శించగలగటం కూడా అంతే ముఖ్యం అనేది ప్రజాస్వామిక లక్షణమనటంలో సందేహం లేదు. అలాగే, లక్ష్యం ముఖ్యంగానీ.. ఆ లక్ష్యం చేరుకోవటానికి ఏ మార్గంలో, ఏ వాహనంలో వెళ్లాలి లాంటి అంశాలకు మరీ ఎక్కువ ప్రాధాన్యత ఉండదు. అవసరమైతే మార్చుకోవచ్చు. అందరికీ ఎదిగే అవకాశాలున్న ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించేందుకు నినాదాలకే పరిమితం కాకుండా విధానాలను పాటలుగా చేసి ప్రచారం చేయగలిగితే ఇదో మంచి పరిణామమే అనుకోవచ్చు.

కొసమెరుపు: 70 ఏళ్లు ఉన్న నేను.. వీపులో ఆరు బుల్లెట్లు దించుకున్న నేను నాయకత్వం వహించాలి. యువకులైన మీరు సెల్‌ఫోన్‌లు చూసుకుంటూ టైంపాస్ చేస్తారా?' అని గద్దర్ ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నకు యువత సమాధానం చెప్పాలి మరి! *

## సత్తా ఏ ఒక్క కులం సొత్తు కాదు

దళితుల పట్ల సమాజ వివక్షను ఎదుర్కొని ఎదిగిన బాబూ జగ్జీవన్ రాం.. సమర్థత, పాలనా దక్షతతో ఈ దేశానికి గొప్ప సేవలందించారని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలివితేటలు, సామర్థ్యం ఏ ఒక్క కులం, మతం, ప్రాంతం సొత్తుకాదని నిరూపించారన్నారు. జగ్జీవన్ రాం 110వ జయంతి సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి అల్లేని నిఖిల్‌తో కలిసి ఆయన నివాళులర్పించారు. లోక్‌సత్తా పార్టీ నేతలు రవీందర్, గడాలే సూర్యప్రకాష్, రాందేశ్‌పాండే, జయంత్, శ్రీనివాస్, సరోజాదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. *



# లోక్‌సత్తా అనే ఎత్తు మీద ఉన్నాం కాబట్టే..




మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి 1915లో వచ్చారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మొట్టమొదటి పెద్ద ఉద్యమాన్ని బీహార్‌లోని చంపారన్ వద్ద 1917లో చేపట్టారు. చట్టబద్ధ విధానాలతో, హేతుబద్ధ వాదనలతో, శాంతియుత మార్గంలో రైతుల పక్షాన పోరాడి తెల్లదొరలను వణికించారు. చివరికి లక్ష్యం సాధించారు. ఇదే సృజనాత్మక ఒత్తిడి పోరాట పంథాకు కొన్ని మార్పులు చేర్పులు చేసుకుంటూ ప్రజలను ఏకం చేసి భారతదేశ స్వతంత్రాన్ని సాధించారు. చంపారన్ ఉద్యమాన్ని ప్రారంభించి 2017 ఏప్రిల్‌కి వందేళ్లు అయిన సందర్భంగా 'సృజనాత్మక ఒత్తిడి' పోరాటపంథాకు 100 ఏళ్లు' శీర్షికతో 'లోక్‌సత్తా టైమ్స్' ఈ ఏడాది మార్చి 1-15 సంచికలో కవర్‌పేజీ కథనం ప్రచురించాం. దీనికి ఓ ఫీడ్‌బ్యాక్ వచ్చింది.

"గాంధీని అభిమానించేవారు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ఉంటారు. ఆయన విధానాలను అనుసరించేవారు మనదేశంలోనే లక్షలమంది ఉన్నారు. గాంధీ చెప్పినవన్నీ తూచ తప్పకుండా అనుసరించేవారూ పలువురు కనిపిస్తుంటారు. గాంధీ మీద పరిశోధనలు చేసినవారు కూడా బోలెడు మంది ఉన్నారు. వివిధ ట్రస్టులు, చరిత్రకారులు ఇప్పటికీ గాంధీ మీద పత్రాలను ప్రచురిస్తున్నారు. కానీ నాకు తెలిసినంతమట్టుకు లోక్‌సత్తా టైమ్స్‌లా 'సృజనాత్మక పోరాటపంథా'ను గాంధీ మార్గంలో ప్రధానాంశంగా గుర్తించి, సమకాలీన రాజకీయ, సామాజిక, వైయక్తిక జీవితాలకు వర్తింపచేయటం ఎవరూ చేయలేదు" అంటూ ఒకాయన ప్రశంసించారు.

వారికి చెప్పిన సమాధానాన్నే లోక్‌సత్తా టైమ్స్ పాఠకులకూ తెలియచేయటం బాధ్యతగా భావిస్తున్నాం.

"తమ పార్టీని ఎన్నికల్లో అద్భుతంగా గెలిపించే వ్యక్తిగత నిజాయతీపరులైన నాయకులు ఈ దేశంలో 20-30 ఏళ్లకోసారైనా వస్తున్నారుగానీ.. ఈ దేశంలో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనివ్వటానికి సమగ్రంగా, ఆచరణాత్మకంగా ఏం చేయాలో చెబుతూ అందుకోసం వ్యవస్థలను నిర్మించే నాయకుడు/నాయకురాలు, వేదిక మాత్రం స్వతంత్ర భారతదేశంలో ఇంతవరకూ రాలేదు. అలాంటి వ్యవస్థీకృత నిజాయతీతో తొలిసారిగా వచ్చిన లోక్‌సత్తా అనే ఎత్తు మీద ఉన్నాం కాబట్టే.. ఎంతో దూరం చూడగలుగుతూ గాంధీ గురించి ఆ కోణంలో రాయగలిగాం. ఇది ఏ ఒక్కరి సొత్తూ కాదు. అలాగే తాబట్టిన కుందేలుకు మూడే కాళ్లు అని లోక్‌సత్తా ఎప్పుడూ వాదించదు. ఎంతో ఆలోచించి రూపొందించిన విధానాలను సందర్భానుసారంగా నిరంతరం ప్రజలముందుంచు తుండటంతోపాటు.. హేతుబద్ధంగా ఉండే మెరుగైన ఆలోచనలను స్వీకరించటానికి సదా సిద్ధంగా ఉంటుంది. ప్రపంచదేశాల అనుభవాలను, మనదేశంలోని మేలిమి పరిణామాలను అధ్యయనం చేసి, స్వదేశీ పరిస్థితులకనుగుణంగా డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆచరణాత్మకంగా రూపొందించిన ఎజెండా, వేదిక లోక్‌సత్తా. అజరామరమైన లోక్‌సత్తా భావాల్ని ప్రజలు, ప్రజాసేవకులు వీలైనంత త్వరగా వినియోగించుకునేలా చేయటానికే లోక్‌సత్తా టైమ్స్ వంటి మార్గాల్లో కూడా ప్రయత్నిస్తున్నాం. లోక్‌సత్తా ఆలోచనలను ప్రజలు తమ జీవితాల్లో పూర్తిస్థాయిలో సద్వినియోగించుకుని లబ్ధిపొందుతుండాలన్నదే, దీన్నే జీవనశైలిగా మార్చాలన్నదే మా తపన, లక్ష్యం" అని సమాధానమిచ్చాం.

లోక్‌సత్తా అభిమానులు, ఆలోచనాపరులు, ముఖ్యంగా యువత ఎన్నికల అంశాలకే పరిమితమై ఉదాసీనంగా మారకుండా.. రోజూ ఎంతో కొంత అధ్యయనం చేస్తూ తమ చుట్టూ ఉన్న ప్రజల సమస్యలపై సాంకేతికతను


*వినియోగించుకుంటూ ఆత్మవిశ్వాసంతో లోక్‌సత్తా కోణంలో ఏదోకమేర పరిష్కారాల కోసం పనిచేస్తుండాలని చెప్పటం కోసమే ఈ ఫీడ్‌బ్యాక్ గురించి ప్రత్యేకించి ప్రచురించామని వినమ్రంగా తెలియచేస్తున్నాం.*

*అలాగే సాంప్రదాయ రాజకీయ నేతలు తమ తప్పుల్ని దిద్దుకోకపోతే, లోక్‌సత్తా రాజకీయం రావటం మరీ ఆలస్యమైతే రాజకీయాలలోకి కూడా రోబోలు వస్తాయని 'సాంప్రదాయ నేతలకు సవాల్ రోబో లీడర్లు' పేరుతో **2015** (డిసెంబర్ **16-31**)లో 'లోక్‌సత్తా టైమ్స్' కవర్‌స్టోరీని ప్రచురించాం. **2017**లో లండన్‌లో ఇదే ఆలోచనపై సర్వే చేశారు. రాజకీయాలలోకి రోబోలు రావటానికి తమకు అభ్యంతరం లేదని పలువురు బ్రిటన్‌వాసులు చెప్పారు. ఈ వార్తని గత సంచికలోనే ప్రచురించాం.*

*సరైన నాయకులు ఎన్నికయ్యే వ్యవస్థను నిర్మించుకుని మంచి రాజకీయం తెచ్చుకోవటమా? రోబోలకు అవకాశం ఇవ్వటమా?.. అనే ఆలోచనను పెంచేందుకు కొంతైనా అదనంగా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో.. లోక్‌సత్తా టైమ్స్ **2015**లో ప్రచురించిన కవర్‌స్టోరీలోని కొన్ని అంశాలను తిరిగి అందిస్తున్నాం.*

*-లోక్‌సత్తా టైమ్స్ ఎడిటోరియల్ టీం*

# సాంప్రదాయ రాజకీయ నేతలకు సవాల్ 'రోబో లీడర్లు'




■ మనకు మంచి రాజకీయం లేకపోవటమే పెద్ద సమస్య. సమస్యలన్నిటికీ అదే మూలం. మనమేమో మంచి రాజకీయం అవసరమేగానీ, నేనొక్కడినే ఓటు వేస్తే వస్తుందా? మిగిలినవారిలాగే నేనూ నా తాత్కాలిక తాయిలాల కోసం, కులం, మతం, ప్రాంతం వంటి వాటి కోసం, డబ్బు, ఆర్భాటాలతో మెరిపించే వారి కోసం, అది కూడా ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థలో గెలిచే అవకాశాలు ఉన్నవారి కోసం ఓటు వేస్తాను అంటున్నాం. అందుకే లోక్‌సత్తా ఎంత కష్టపడుతున్నా.. అవసరం, అనివార్యం, అజరామరం అంటున్నాంగానీ ఓట్లు వేసి మాత్రం గెలిపించలేకపోతున్నాం. ఎన్నికలచ్చే సమయానికి పూనక మొచ్చినట్టు సాంప్రదాయ పార్టీలకే ఓటు వేసి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడుతున్నాం... సరే, ఇప్పుడు ఈ సాంప్రదాయ పార్టీల నుంచి లోక్‌సత్తా కొత్త రాజకీయం వైపు వచ్చే మధ్యలో రోబో నాయకులను ఎందుకు ట్రై చేయకూడదు?

■ అన్ని స్థాయిల్లో కాకపోయినా ప్రస్తుత రాజకీయాలలో కొన్ని పదవుల్లో రోబో లీడర్ల స్టార్టప్ ఇక ఎంతమాత్రమూ తీసిపారేయగలిగిన పరిణామం కాదు.

■ రోబోలు ఎంత అద్భుతంగా పనిచేసినా రాజకీయాలలో లోక్‌సత్తా నిత్య నూతన నిర్మాణాత్మక రాజకీయానికి సాటిరావు. కానీ సాంప్రదాయ రాజకీయ నాయకత్వానికి మాత్రం రోబోలు ప్రత్యామ్నాయాన్ని అందించగలవు. రోబో లీడర్లను నమ్ముకుంటే గొప్ప దార్శనిక మార్పులైతే రావుగానీ, సాంప్రదాయ రాజకీయంలోపలే అవినీతి, వేధింపులు ఉండవు, పక్షపాతం ఉండదు, భద్రత ఉంటుంది, ప్రభుత్వ సేవలు నాణ్యంగా అందుతాయి, తెరవెనక లాలూచీలు, పైకి మాత్రం తీవ్ర పరస్పర ఆరోపణల నాటకాలు ఉండవు. కఠిన చట్టాల అవసరం, వాటిని దుర్వినియోగం చేస్తారనే భయం, విలువైన వనరుల దోపిడీ ఉండదు. ప్రజలకు దిక్సూచిల్లా నాయకత్వం అందించే బాధ్యత తీసుకోకుండా, జనం కోరుకుంటున్న పాలనే అందిస్తున్నాం తప్ప మా తప్పేం లేదు అంటూ దోచుకునే యాంత్రిక, మొక్కుబడి నాయకుల కంటే రోబోలు చాలా మేలు. అంటే, ఇప్పుడు నడుస్తున్న పాలనకంటే రోబోల నేతృత్వంలో చాలా మెరుగైన పాలనే లభిస్తుందన్న మాట.

■ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దగ్గర్నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖరరావు, చంద్రబాబు నాయుడు వరకూ ఇప్పటికే డిజిటల్ ఇండియా కోసం వేగంగా దారులు పరుస్తున్నారు. మోదీ సిలికాన్ వేలీకి ప్రత్యేకించి వెళ్లి మనదేశాన్ని డిజిటలైజ్ చేసే కృషిలో భాగస్వాములయ్యేలా పలుకంపెనీల్ని ఒప్పించారు. హైదరాబాద్‌లో డిజిటల్ ఆవిష్కరణల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి మరీ ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు ఏకంగా రోబోల తయారీ సహా

వివిధ విభాగాలలో సాంకేతిక దిగ్గజాలైన జపాన్, సింగపూర్‌లను ప్రత్యక్ష వ్యాపారాలకు ఆహ్వానించారు. కాబట్టి రోబో లీడర్లకు కార్యక్షేత్రం సిద్ధమవుతోంది. సాంప్రదాయ రాజకీయం నుంచి లోక్‌సత్తా నూతన రాజకీయంలోకి మారటానికి మనకేమన్నా శంకలు, వంకలు ఉంటే.. ఈలోగా సాంప్రదాయ రాజకీయం లోపలే రోబో లీడర్ల నియామకాన్ని పరిశీలించవచ్చు. కొన్ని పదవుల్లో ఎన్నికైన నాయకులు లేకుండా రోబో లీడర్లను ఏర్పాటు చేసుకోవచ్చు.

■ మన సాంప్రదాయ ప్రజాప్రతినిధులు చేసే పనులన్నీ రోబో లీడర్లు అలవోకగా చేసేయగలుగుతారు. చూడండి.

■ మనం ఎన్నుకున్న కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీ, ఆ మాటకొస్తే మంత్రి ఏం చేస్తున్నారు? పొద్దున్నే లేచి ఆ రోజు కార్యక్రమాలను చూసుకోవటం, ప్రజల వినతిపత్రాలు తీసుకోవటం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టేందుకు అధికారిక దళారీలా వ్యవహరించటం, అధికారులు, వచ్చినవారితో మీటింగుల్లో, మీడియా సమావేశాలలో ఏం మాట్లాడాలో సహాయకుల నుంచి తీసుకోవటం వగైరాలు అధికారికంగా చేస్తారు. ఇక లంచాలు, దందాలు, కబ్జాలు, రాజకీయ లాలూచీలు, ఆశ్రిత పక్షపాతాలు వంటివి రహస్యంగా చేస్తారు. ఏవైనా దురదృష్టకర సంఘటనలు జరిగితే పరామర్శించి కడివెడు కన్నీరు కార్చినట్టు నటిస్తూ ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తారు. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగలు ఉంటే మీలో ఒకడినే అన్నట్టుగా చిందేస్తూ మురిపిస్తారు. స్థానికంగా నేనే నాయకుడిని అన్నట్టుగా గల్లీ పనుల్లో కూడా వేళ్లు పెడతారు. ప్రజలకు వండివడ్డించి తినిపిస్తున్నట్టుగా ఫోజులిస్తారు. మీడియాలో అవకాశమున్నచోట వాలి పోతుంటారు. చట్టసభల సమావేశాలున్నప్పుడు మాట్లాడటానికి ఏమీ ఉండదు కాబట్టి, సమావేశాలను అడ్డుకోవటం లేదా తాము ఆచరించని ఆదర్శాలను ఏమాత్రం సిగ్గుపడకుండా వల్లిస్తుంటారు. ఫ్లెక్సీలు, కటౌట్లు పెట్టుకుంటుంటారు. సోషల్ మీడియాలో పోస్టింగులు, రియాక్షన్లు, ఇతరత్రా ప్రచారాలు చేస్తుంటారు. ఇదేగదా ప్రజల మనుషులుగా చెప్పుకునే చాలామంది ఎన్నికైన నాయకుల రోజువారీ కార్యకలాపాలు. ఇవన్నీ రోబో లీడర్లు చేయలేరా?

రోజువారీ పాలన,

ప్రెస్ మీట్లు,

సోషల్ మీడియా పోస్టింగులు,

పరామర్శలు,

పర్యటనలు, మీటింగులు,

సమీక్షలు,

ఊకదంపుడు ఉపన్యాసాలు,

పంచ్ డైలాగులు,

ఈవెంట్ మేనేజ్‌మెంట్లు

ఇవన్నీ చేయటంతోపాటు సాంప్రదాయ నేతలు చేయలేని అనేక ప్రజోపకరమైన పనుల్ని కూడా రోబో లీడర్లు చేస్తారు. అవేంటంటే...

- రోబో లీడర్లకు అవినీతి ఉండదు
- కులం, మతం వంటి విద్వేషాల్ని రెచ్చగొట్టకుండా రాజ్యాంగబద్ధంగా, నిజాయతీగా వ్యవహరిస్తారు
- పార్టీలు ఫిరాయించరు, తమ పార్టీయే ఆదేశించినా సరే తప్పుడు విధానాలకు తలొగ్గరు
- వంశపారంపర్య రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం ఉండదు
- విలాసాలు, ఆడంబరాలు, ప్రత్యేక విమానాలు అడగరు
- మీడియా కవరేజీలు, సొంత మీడియాల ఏర్పాటు కోసం వెంపర్లాడరు
- టీవీ చర్చల్లో యుద్ధవాతావరణాలు, జనాన్ని మోసం చేసే హైడ్రామాలు ఉండవు
- మేనిఫెస్టోల్లో చెప్పిన మాటలకి కట్టుబడి ఉంటారు
- చెప్పిన పనిని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేస్తారు, ప్రజాధనం ఆదా చేస్తారు
- ఎన్నికల్లో బ్లాక్ మనీ ఖర్చు చేయరు
- సామాజిక మాధ్యమాల్లో ప్రచార కాలుష్యం తగ్గిస్తారు
- ప్రజలు తమకు కావలసిన ఎజెండా, రాజ్యాంగ ప్రజాస్వామ్య పద్ధతులు, విలువల సాఫ్ట్‌వేర్‌తో రోబోను రూపొందించుకోవచ్చు. మెరుగైన రోబోల ఎంపిక కోసం వేలంపాటలు, ఓటింగ్ వంటి కొన్ని ఏర్పాట్లు చేసుకోవచ్చు. సాంకేతిక నేరాల వల్ల హ్యాకింగ్‌లు జరగకుండా కొన్ని ముందు జాగ్రత్త చర్యల్ని తీసుకోవచ్చు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా. మనకు సేవకులుగా ఉండాల్సిన ప్రభుత్వోద్యోగులు మనల్ని బానిసల్లాగా చూస్తూ, లంచాలు గుంజుతూ వేధిస్తుంటే, వారితో కుమ్మక్కయిన రాజకీయ నేతలు హక్కుగా పౌరసేవలందించేందుకు సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేసే సాహసం చేయకుండా ఉంటే, ఎల్లకాలం సహిస్తూండాలా? రోబో అధికారుల్ని కొన్ని చోట్లయినా ప్రారంభించుకోవటంలో తప్పేం లేదు.

రాజకీయ పార్టీలు కూడా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాల కోసం రోబో కార్యకర్తలు, లీడర్ల సేవలను వినియోగించుకోవచ్చు.

అలాగే సాధారణ, మొక్కుబడి పనితీరు కనబరిచే మనలోని చాలామంది కంటే రోబో వర్కర్లు బెటరని భావించే రోజులు వస్తాయి. సృజనాత్మక నిర్మాణాత్మకతతో పనిచేస్తే రాజకీయాలలో లోక్‌సత్తాలాగా రోబోల పోటీని అధిగమించి మనగలుగుతాం. *

# శాసన నియంత్రణను బలహీనపరిచేలా బడ్జెట్ నిర్వహణ

## 2015-16లో కేటాయింపులు, వ్యయాలపై తెలంగాణ ప్రభుత్వానికి 'కాగ్' అక్షింతలు




**2015-16** బడ్జెట్ కేటాయింపులు, వ్యయాలపై తెలంగాణ ప్రభుత్వ తీరును కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఆక్షేపించింది. అవాస్తవిక కేటాయింపులు, భారీ మిగుళ్లు, అనవసర అనుబంధ పద్దులు, కేటాయింపులు లేకుండా చేసిన ఖర్చులు, అదనపు కేటాయింపులు.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లోని నిర్వహణ లోపాల్ని సూచిస్తున్నాయని వెల్లడించింది. ఖర్చుకాని మొత్తాలు చివరన మురిగిపోవడం, పీడీ ఖాతాల్లో ఎక్కువ నిల్వలు పేరుకుపోతుండటం.. పర్యవేక్షణ, నియంత్రణ లోపాలను స్పష్టం చేస్తున్నాయని వివరించింది.

అవసరాలను వాస్తవికంగా అంచనా వేయలేదంటూ బడ్జెట్ కచ్చితత్వంపై కాగ్ సందేహాలు వ్యక్తం చేసింది. అంతర్గత నియంత్రణ కట్టుదిట్టంగా లేదని వ్యాఖ్యానించింది. మూడు త్రైమాసికాలలో 46శాతం నిధులు వ్యయం చేసి చివరి త్రైమాసికంలో 54శాతం ఖర్చు చేయడం హడావుడిని సూచిస్తోందని పేర్కొంది. పీడీ ఖాతాల్లోని మిగులు నిధులను రెవెన్యూ రాబడులకు జమ చేయాలని ఆదేశించి ప్రభుత్వం పద్దుల విధానాన్ని అతిక్రమించిందని

### జాప్యం వల్ల కాంట్రాక్టర్లకు అయాచిత లబ్ధి

తెలంగాణలో సాగునీటి పథకాలు సకాలంలో పూర్తికాకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు రావట్లేదని కాగ్ పేర్కొంది. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధుల వ్యయం సరిగా జరగటం లేదని తెలిపింది. మరోవైపు అంచనాలు పెరిగాయని నివేదించింది. ఒప్పంద సమయంలో తగిన మార్పులు చేయకుండానే, ప్రాజెక్టు ప్రాథమిక అంశాల్లో మార్పులకు అంగీకరించడం వల్ల కాంట్రాక్టర్ల సంస్థలకు అయాచిత లబ్ధి కలిగినట్టు వెల్లడించింది. 23 ప్రాజెక్టులు 2016 మార్చి నాటికి పూర్తవ్వాల్సి ఉన్నా, అది జరగలేదు. వీటిపై 2016 మార్చి 31నాటికి రూ. 24,224కోట్లు ఖర్చయిందనీ, అసంపూర్తిగా ఉన్న పథకాల అంచనాలు రూ. 14,051కోట్లు పెరిగాయనీ పేర్కొంది. భూసేకరణ, పునరావాసంలో జాప్యం, అటవీశాఖ అనుమతులు రాకపోవడం వంటి కారణాల వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని చెప్పింది. అసంపూర్తి ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా ఇతర ప్రాజెక్టులకు పున:కేటాయింపులు జరిపారని తెలిపింది. కరవు, ఫ్లోరైడ్ పీడిత నల్గండ జిల్లాలో మూడు లక్షల ఎకరాలకుఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు చేపట్టిన ఎ.ఎం.ఆర్.పి-ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టుకు రూ. 805కోట్లు (అనుబంధ కేటాయింపు రూ. 205కోట్లు కలిపి) కేటాయించినా, రూ. 592.02కోట్లే ఖర్చు చేశారు. మరో రూ. 26.54కోట్లను ఇతర ప్రాజెక్టులకు పున:కేటాయించారు. ఇక్కడ వాస్తవ ఖర్చు మొదట చేసిన కేటాయింపు కంటే తక్కువగా ఉండగా, అనుబంధ కేటాయింపు రూ. 205కోట్లు అనవసరమని కాగ్ పేర్కొంది. మధ్యతరహా ప్రాజెక్టుల విషయానికొస్తే.. రెండేళ్లలో ఐదు ప్రాజెక్టులు పూర్తిచేయాలన్నది లక్ష్యం కాగా, రెండు ప్రాజెక్టులే పూర్తయ్యాయి. 52వేల ఎకరాలకుగాను 13,900 ఎకరాలకే సాగునీటి సామర్థ్యం కల్పించారు. గొల్లవాగు, నీల్వాయి, జగన్నాథపూర్ పెద్దవాగు ప్రాజెక్టులకు మొత్తం గ్రాంటును ఏఐబీపీ నుంచి అందుకున్నా, 11 సంవత్సరాల తర్వాత కూడా ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ఏఐబీపీ నిర్ధారించిన గడువులోగా ఏ ప్రాజెక్టూ పూర్తికానందున గ్రాంటును రుణంగా మార్చే అవకాశాన్ని తోసిపుచ్చలేమని కాగ్ అభిప్రాయపడింది.

## రైతును ఆదుకోలేని 'రుణమాఫీ'

+ రుణమాఫీ పథకం కింద ప్రభుత్వం తొలి రెండేళ్ల (2014-16)కు గాను 35.30 లక్షల మంది రైతుల అప్పుల మాఫీకి రూ.8,336కోట్లు విడుదల చేసింది. తొలి ఏడాది రూ.4250కోట్లు ఇస్తే, 171.32కోట్లు ఖర్చు కాలేదు.

+ మహబూబ్‌నగర్, నల్గండ, వరంగల్ పాత జిల్లాల్లో 14.99 లక్షల రైతులకు రూ.3509కోట్ల విడుదలపై కాగ్ పరిశీలన జరిపింది.

+ ఆధార్ సంఖ్యలను నమోదు చేయనందున బోగస్ రైతుల ఖాతాలకు మాఫీ సొమ్ము మళ్లింది.

+ ఒక జిల్లాలోని బ్యాంకులు ఇతర జిల్లాల రైతుల అప్పులను సైతం మాఫీ చేశాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకులో ఇతర జిల్లాలకు చెందిన 249మంది రైతుల అప్పులు రూ.1.17కోట్లు మాఫీ అయ్యాయి.

+ 2014 మార్చి వరకూ రైతులు తీసుకున్న అప్పులు, వాటిపై 2014 ఆగస్టు చివరి వరకూ వడ్డీని లెక్కించి ఒక్కో రైతు కుటుంబానికి రూ.లక్ష వరకు మాఫీ చేయాలన్నది నిబంధన. కానీ కొన్ని బ్యాంకులు 2014 మార్చి వరకు ఉన్న అప్పులనే మాఫీ చేసి ఆ తరువాత ఆగస్టు వరకూ పడిన వడ్డీని పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ఆ వడ్డీ సొమ్ము రైతు సొంతంగా కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగ్ పరిశీలించిన 3 జిల్లాల్లోని 13 బ్యాంకులు ఇలా కలపకపోవడంతో రైతులపై రూ.66.16కోట్లు వడ్డీ భారం పడింది. ఇక ఇవే జిల్లాల్లోని 26 బ్యాంకులు 2014 మార్చి నుంచి ఆగస్టు వరకు వడ్డీని అధికంగా లెక్కించి రూ.183.98కోట్లు అధికంగా తీసుకున్నాయి. వడ్డీ లెక్కల్ని ఇంకా తనిఖీ చేస్తే రాష్ట్రం మొత్తం మీదా రూ.వందల కోట్ల దుర్వినియోగం బయటపడే అవకాశముంది.

తెలిపింది. దీంతో రెవెన్యూ రాబడులను రూ.4218 కోట్ల మేర ఎక్కువ చూపినట్టయిందని పేర్కొంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు, వ్యయాలు, నిబంధనల ఉల్లంఘనలను కాగ్ విశ్లేషించింది.

### వాస్తవం కంటే ఎక్కువ రెవెన్యూ మిగులు చూపారు

2015-16 బడ్జెట్ అంచనాలు అవాస్తవంగా.. వ్యయ పర్యవేక్షణ, నియంత్రణ బలహీనంగా ఉన్నాయి. బడ్జెట్‌లో రూ.238కోట్ల రెవెన్యూ మిగులు చూపారు. వాస్తవం కంటే ఇది ఎక్కువ. సహాయక గ్రాంట్లు రూ.151కోట్లను క్యాపిటల్ పద్దు కింద వర్గీకరించటం, బడ్జెటేతర రుణాల నుంచి రూ.3719కోట్లను రెవెన్యూ రాబడులకు క్రెడిట్ చేయటంతో రెవెన్యూ మిగులు ఎక్కువ చూపినట్టయింది. దీంతో ద్రవ్యలోటు రాష్ట్ర జీఎస్‌డీపీలో 3.23శాతం నుంచి 3.87శాతానికి పెరిగింది.

బడ్జెట్ కేటాయింపులకు మించి రూ.5,881కోట్లు వ్యయం చేయడం, అసలు కేటాయింపులే లేనివాటికి రూ.2,161కోట్లు ఖర్చు చేయడం బడ్జెట్ ప్రక్రియలో శాసనపరమైన నియంత్రణను బలహీనపరిచే చర్యగా కాగ్ పేర్కొంది.

### సంతకం లేకుండా రూ.3159కోట్లు

వ్యక్తిగత ఖాతాల (పీడీ అకౌంట్లు) నుంచి రూ.10లక్షలు అంతకంటే ఎక్కువ డ్రా చేయడానికి ఆర్థిక శాఖ కార్యదర్శి సంతకం ఉండాలి. దీన్ని అతిక్రమించి మార్చి నెలలోనే 384 చెక్కుల ద్వారా రూ. 3159 కోట్లు డ్రా చేశారు. దీనికి హైదరాబాద్ అర్బన్ డీటీవో అనుమతించారు.

## అప్పులు తీర్చడానికి అప్పులు!

రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తీర్చడానికి మరిన్ని అప్పులు చేయాల్సి వస్తోందనీ, అలా కాకుండా రుణాల చెల్లింపునకు సరైన వ్యూహాన్ని రూపొందించుకోవాల్సిన అవసరముందని కాగ్ స్పష్టంచేసింది. 2016 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ ఆర్థిక స్థితిగతులపై ఇచ్చిన నివేదికలో అప్పుల గురించి వివరంగా ప్రస్తావించింది. మొత్తం రుణాల్లో ప్రభుత్వం 2019-21 సంవత్సరాల్లో రూ.14,674కోట్లు, 2021-23 మధ్య రూ.17,773కోట్లు తీర్చాల్సి ఉందని తెలిపింది. మిగులు లేనందున వ్యయ బాధ్యతలు నెరవేర్చడానికి ప్రభుత్వం మరింతగా అప్పులు చేస్తోందని పేర్కొంది. మార్కెట్ రుణాలపై వడ్డీ చెల్లింపులు రెవెన్యూ వసూళ్లలో 6.78శాతం.. మొత్తం బకాయిలు జీఎస్‌డీపీలో 21.37శాతం (14వ ఆర్థిక సంఘం సూచించినట్టు 21.55శాతం పరిమితిలో) ఉన్నట్టు పేర్కొంది. వడ్డీ చెల్లింపుల (రూ.7558కోట్లు) వాటా రెవెన్యూ వ్యయంలో పదిశాతంగా ఉంది. 14వ ఆర్థిక సంఘం అంచనాల (రూ.7,057కోట్లు) కంటే ఇది అధికంగా ఉందని, 2015-16లో వడ్డీ చెల్లింపుల మొత్తం రెవెన్యూ రాబడుల్లో 9.92శాతం ఉన్నాయని తెలిపింది.

## ఆర్థిక సంస్థల పెరుగుదల రేటులో ఆరో స్థానం

ఉపాధి కల్పిస్తున్న ఆర్థిక సంస్థల సంఖ్య పెరుగుదల రేటులో తెలంగాణ దేశంలో ఆరో స్థానంలో (77.94శాతం పెరుగుదల) ఉందని రాష్ట్ర ప్రణాళిక శాఖ విశ్లేషించింది. సంఖ్యాపరంగా చూస్తే 12వ స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 20.87లక్షల ఆర్థిక సంస్థలు 55.36లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతంలో 11.97లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 8.9లక్షల ఆర్థిక సంస్థలు ఉన్నాయి. తెలంగాణ ఆరో ఆర్థిక గణనను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికా శాఖా మంత్రి ఈటల రాజేందర్ విడుదల చేశారు. మొత్తం ఆర్థిక సంస్థల్లో వ్యవసాయ సంబంధిత ఆర్థిక సంస్థలు 15.68శాతంకాగా, వ్యవసాయేతర సంస్థలు 84.32శాతం ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 23.65లక్షల మంది (42.69శాతం), పట్టణ ప్రాంతాల్లో 31.73లక్షలమంది (57.3శాతం) ఉపాధి పొందుతున్నారు. గ్రామాల్లో సంస్థలు ఎక్కువ, ఉపాధి తక్కువగా ఉంది. వ్యవసాయ సంస్థల ద్వారా పది శాతం మంది ఉపాధి పొందుతుండగా, వ్యవసాయేతర సంస్థల నుంచి 90శాతం మంది ఉపాధి పొందుతున్నారు. మొదటిసారిగా ఈ గణనలో హస్తకళలు, చేతిమగ్గాలకు సంబంధించిన పరిశ్రమలను కూడా పరిగణలోకి తీసుకున్నారు. ఆర్థిక సంస్థల్లో పనిచేస్తున్న వ్యక్తులకు సంబంధించి రాష్ట్రం దేశంలో పదో స్థానంలో ఉంది. బతుకు తెరువు కల్పించటంలో వ్యవసాయేతర రంగాల వాటా 9044శాతంకాగా, వ్యవసాయ రంగం వాటా 9.56శాతం. తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో చిన్న సంస్థలు కీలకంగా ఉన్నాయి. ఐదుగురు, అంతకంటే తక్కువమందికి ఉపాధినిచ్చే సంస్థలు 90శాతం ఉన్నాయి. వ్యవసాయేతర రంగాల్లో.. తయారీ, మరమ్మతులు, యంత్ర పరికరాలు తదితర 17.60లక్షల సంస్థలు 50.07 లక్షలమందికి ఉపాధినిస్తున్నాయి. వీటి తర్వాతి స్థానంలో నిర్మాణరంగముంది. వ్యవసాయేతర సంస్థలలో సొంత ఆర్థిక వనరులతో నిర్వహించుకుంటున్నవి 86.24శాతం.

**ఇంకొన్ని అంశాలు :**

- బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ, నీటిపారుదల శాఖల్లోనే రూ.15,385కోట్ల మిగులు ఉంది. ఇది బడ్జెట్ కచ్చితత్వంపై సందేహాలను కలిగిస్తోంది.
- నిధులు వ్యయం కాకున్నా అనుబంధ కేటాయింపులు చేశారు. 38 అంశాల్లో రూ.8946కోట్ల అనుబంధ కేటాయింపులు అనవసరం.
- తొలి కేటాయింపులు అధికంగా ఉన్నా పాఠశాల విద్య, పురపాలన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి తిరిగి కేటాయింపులు చేశారు.
- 288 ఉపపద్దుల్లో రూ.31,502 కోట్లు వ్యయం చేయకుండా తిరిగి అప్పగించారు. 85 పద్దులలో రూ.8715కోట్లకుగాను పైసా కూడా వ్యయం చేయలేదు.
- బడ్జెట్ అంచనాల్లో గంపగుత్త కేటాయింపులు చేయకూడదని బడ్జెట్ మాన్యువల్‌లో ఉన్నా రూ.55కోట్లు పెద్దపద్దు కింద కేటాయించారు.
- మిగులు కంటే ఎక్కువ నిధులను సరెండర్ చేయడం బడ్జెట్ నియంత్రణ, పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తుంది.
- ఎస్సీ ఉపప్రణాళికలో 48శాతం, ఎస్టీ ఉప ప్రణాళికలో 49శాతం నిధులను మాత్రమే వినియోగించారు.
- సినరేజీ రుసుం రూ.434కోట్లు వసూలు కాగా రూ.19.36కోట్లు విడుదల చేశారు.
- వాడుకలో లేని ఉపపద్దులను నిర్వహిస్తున్నారు. ప్రధాన ఆడిటింగ్ అధికారి అనుమతి లేకుండా కొత్త పద్దులను ప్రారంభించకూడదు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా 39 ఉపపద్దులను తెరిచారు.
- 2015-16లో రూ.5881కోట్లు శాసనసభ ఆమోదం లేకుండా వ్యయం చేశారు.
- పీడీ ఖాతాల్లో అవకతవకలున్నాయి. 29,311 పీడీ ఖాతాల్లో 2016 మార్చి నాటికి రూ.8019కోట్లు నిల్వ ఉంది. వాటిని పీడీ ఖాతాలకు బదిలీ చేశారు.
- జిల్లా పరిషత్ భవిష్య నిధికి సంబంధించి వడ్డీతో కూడిన డిపాజిట్ల కోసం రూ.716కోట్లను బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉండగా.. అసలు కేటాయించలేదు.

- రూ.3532కోట్లకు సంబంధించి 10852 ఓచర్లు రాకపోవటం.. నిధుల స్వాహా, అక్రమాలు వంటి సందేహాలకు తావిస్తోంది.

- తెలంగాణలో ఉపాధి అవకాశాల కల్పన, ఎగుమతుల పెంపుదల కోసం ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం కింద చేపట్టిన జౌళి పార్కుల పనితీరు నిరాశాజనకంగా ఉంది. పార్కుల నిర్మాణంలో 7 నెలల నుంచి 151 నెలల వరకు జాప్యం జరిగింది. సిరిసిల్లలో నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన రూ.104కోట్ల ఆర్థికసాయాన్ని కోల్పోయింది. సిరిసిల్ల జౌళి పార్కులు, వైట్‌గోల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పిన్‌టెక్స్ పార్కులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6.04కోట్లు, కేంద్రం రూ.14.34కోట్లను వెచ్చించినా లబ్ధి చేకూరలేదు.

- ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సిబ్బంది చేతివాటం ఎక్కువైంది.

- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చేపట్టిన పనుల్లో ప్రభుత్వ నిర్ణయాలు గుత్తేదారులకు అయాచిత లబ్ధిని చేకూర్చాయి. కంది–షాద్‌నగర్ మార్గంలో పనులు నిరాశాజనకంగా ఉండటంతో ఒప్పందాన్ని రద్దు చేయాలని సిఫార్సు చేసినా, రూ.10కోట్ల పూచీకత్తుతో 2017 మే వరకు పొడిగించారు. గుత్తేదారు నుంచి పరిహారం కూడా వసూలు చేయలేదు.

- రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఐఐసీ).. ప్రయివేటు కంపెనీలతో కలిసి రెండు ఉమ్మడి సంస్థలు (జేవీ), 8 ప్రత్యేక ప్రాయోజక వాహక సంస్థ (ఎస్పీవీ)లను ఏర్పాటు చేయగా, వాటి నుంచి లాభం రాకపోగా నష్టం వచ్చింది.

- ప్రభుత్వ వైద్యంలో నాణ్యతను గాలికొదిలేశారు. మందులు, సర్జికల్ పరికరాల నిల్వ నిర్వహణలో ప్రమాణాలు తీసికట్టుగా మారాయి. సరోజనిదేవి కంటి ఆసుపత్రిలో పంపిణీ చేసిన కాంపౌండ్ సోడియం లాక్టేట్ ఇంజక్షన్‌ని మార్చి 2016లో కొనుగోలు చేసి ఆసుపత్రికి పంపించారు. పంపించే నాటికి సంస్థ ఇచ్చిన అంతర్గత నివేదికే తప్ప వీటికి ప్రయోగశాలలో నాణ్యత పరీక్షలు చేయించలేదు. జూన్ 30న శస్త్రచికిత్సలు చేశారు. ఆ మరుసటిరోజు రోగులకు ఇన్ఫెక్షన్ సోకింది. తుదినివేదిక ప్రకారం ఇన్ఫెక్షన్‌లకు కారణం కలుషిత రింగర్ లాక్టేట్ ద్రావణమేనని తేలింది.

- విద్యార్థులకు నాణ్యమైన చదువును అందించి, పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన గురుకులాల్లో విద్యాప్రమాణాలతో పాటు విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది.

- పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ సవరణ ప్రకారం 29 అంశాలను బదిలీ చేయాల్సి ఉండగా, 10 మాత్రమే చేశారు.

- విద్యుత్ పంపిణీ సంస్థల అధ్వాన్న పనితీరు వల్ల పలు విభాగాల్లో కోట్ల రూపాయల నష్టం వస్తోంది. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ 2010–11లో రూ.3.20కోట్ల లాభంతో ఉంటే, పనితీరు సరిగా లేనందున 2015–16నాటికి రూ.1010.08కోట్ల నష్టం ఏర్పడింది. వ్యవసాయానికి గతేడాది వరకు రోజూ 7 గంటలు కరెంట్ సరఫరా చేశామని చెబుతూ డిస్కంలు రాయితీ నిధుల్ని పొందుతున్నాయి. కానీ రోజుకు 6 గంటలు, అంతకంటే తక్కువే సరఫరా జరిగినట్టు పరిశీలనలో తేలింది. తెలంగాణలో అత్యధిక వర్గాలకు జాతీయ ఛార్జీల పథకానికి విరుద్ధంగా ఎక్కువ ఛార్జీలను నిర్ణయించి రూ.909.37 కోట్లు అదనంగా వసూలు చేశారు.

- హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో చేస్తున్న పలు ప్రాజెక్టుల్లో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన, గుత్తేదారులకు అదనపు చెల్లింపులు తదితర అంశాలను కాగ్ తూర్పారపట్టింది. పాత బస్తీలోని రెండు జోన్లలో మురుగునీటి వ్యవస్థకు దాదాపు రూ.409కోట్లు, రాజేంద్రనగర్‌లోని భూగర్భ డ్రైనేజీ కోసం రూ.314.26కోట్లతో చేపట్టిన పనుల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్టు వివరించింది. అస్తవ్యస్త డీపీఆర్, వడ్డీల మాయం, అర్హతలేని గుత్తేదారుకు పనులు, అదనపు చెల్లింపులు వంటి అనేక అంశాలలో జనం సొమ్ము వృథా అవుతున్నా పర్యవేక్షణ, చర్యలు లేవని పేర్కొంది. *

# పట్టిసీమ వృధా.. విద్య వైద్యం అధ్వాన్నం

## ఏపీ ప్రభుత్వాన్ని కడిగేసిన కాగ్




రికార్డు సమయంలో పూర్తి చేశామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెప్పుకుంటూ భుజకీర్తులు తగిలించుకుంటున్న పట్టిసీమ ప్రాజెక్టు హేతుబద్ధతను, వ్యయం తీరును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రశ్నించింది. గోదావరి-కృష్ణా నదులను అనుసంధానించిన పట్టిసీమ ప్రాజెక్టులో రూ.350కోట్లు వృధా అయినట్టు 2015-16 నివేదికలో తెలిపింది. సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టుల్లో దుబారా వ్యయాల్నీ, కాంట్రాక్టర్లకు వందల కోట్ల మేర కల్పించిన అనుచిత లబ్ధిని ఎత్తిచూపింది. జల వనరుల ప్రాజెక్టుల్లో డీపీఆర్లు, టెండర్ల దగ్గర్నుంచి జరుగుతున్న భాగోతాన్ని ఎండగట్టింది. చాలా సాగునీటి ప్రాజెక్టులకు లక్ష్యం కూడా లేదని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రహదారుల పనుల్లో కూడా ఇదే తరహాలో కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లకుండా ఖజానాను గుల్లచేస్తున్నారని విశ్లేషించింది. కేటాయింపులు లేకుండా రూ.36వేల కోట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖర్చు చేయటమేమిటని తప్పుపట్టింది. విద్య, ఆరోగ్యంలో నిధుల వ్యయం తప్ప నిర్దిష్ట ఫలితాలు లేవని ఆక్షేపించింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉత్తీర్ణతలు పెరుగుతున్నాయిగానీ, ప్రతిభావంతులు తయారవటం లేదని వెల్లడించింది. భూములకి సంబంధించిన రికార్డుల్ని కూడా రెవెన్యూశాఖ సక్రమంగా పట్టించుకోవటం లేదని ప్రశ్నించింది.

### వినియోగదారులెవరో గుర్తించకుండానే పట్టిసీమ నిర్మించేస్తారా?

గోదావరి నుంచి 80 టీఎంసీల నీటిని గృహ పారిశ్రామిక వినియోగం కోసం మళ్లించే లక్ష్యంతో పట్టిసీమ నిర్మాణానికి 2015 జనవరిలో ప్రభుత్వం పాలనామోదం ఇచ్చింది. ఇందులో సాగునీటి వసతుల గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ప్రాజెక్టు కింద వినియోగదారులు ఎవరో కూడా స్పష్టంగా గుర్తించలేదని స్పష్టమవుతోందని కాగ్ పేర్కొంది.

- ఈ పథకం వల్ల నీటిని పొందే పరిశ్రమల వినియోగదారులను గుర్తించలేదని, పోలవరం కుడికాలువ కింద డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఇంకా ఖరారు కానందున గృహావసరాల కోసం గ్రామాలను ఇంకా గుర్తించలేదని వివరించింది.
- పట్టిసీమ సకాలంలోనే పూర్తయినా పోలవరం కుడికాలువ పనులు పూర్తికాకపోవడంతో జల వనరుల శాఖ కేవలం 11 పంపులతోనే నీటిని ఎత్తిపోయగలిగింది. అధిక టెండరు ప్రీమియానికి పనులు అప్పగించటం వల్ల ఆశించిన ప్రయోజనం దక్కలేదని, రూ.199 కోట్లు అదనంగా ఖర్చు చేసినట్టయిందని కాగ్ తప్పుపట్టింది.
- సెంట్రల్ ఎక్సయిజ్ సుంకం, కార్మిక సంక్షేమ శిస్తును తప్పుగా తిరిగి చెల్లించడం వల్ల గుత్తేదారుకు అనుచిత లబ్ధి చేకూర్చినట్టు వివరించింది.
- పారిశ్రామిక నీటి సరఫరా ద్వారా వచ్చే ఆదాయాన్ని రూ.41.51 కోట్లుగా పరిగణించారని, ఇంతవరకు పారిశ్రామిక యూనిట్లను గుర్తించనే లేదని నిందించింది.
- పట్టిసీమ జీవనకాలం 20 ఏళ్లుగా గుర్తించి తరుగుదలను లెక్కించారని, పోలవరం పూర్తయ్యేవరకే ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ప్రతిపాదించారని, ఈ రకంగా పట్టిసీమ జీవనకాలం మూడేళ్లే అవుతుందని కూడా ప్రస్తావించింది.

### హంద్రీనీవాలో కాంట్రాక్టర్‌కు రూ.5కోట్లు అదనపు చెల్లింపు

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం రెండోదశలో 6వ ప్యాకేజీ, 10వ ప్యాకేజీలకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రూ.4.97కోట్లు అదనంగా చెల్లించినట్టు కాగ్ తప్పుపట్టింది. ఈ రెండు ప్యాకేజీల్లో పనులు ఆలస్యం కావడం వల్ల మళ్లీ గడువును పొడిగించారు. జలవనరుల శాఖలో సాగునీటి

# ఎత్తిపోతలపై మొట్టికాయలు

సరైన అవగాహన కూడా లేకుండా ఏపీ జలవనరుల శాఖ ఎత్తిపోతల పథకాలను చేపడుతోందని కాగ్ మొట్టికాయలు వేసింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీ అసమగ్రంగా ఉందని, భూసేకరణలో ఆలస్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణమూ ఆలస్యమవుతోందని పేర్కొంది. లబ్ధి, వ్యయ నిష్పత్తిని సరిగా లెక్కించడం లేదని తప్పుపట్టింది. అవసరమైన అనుమతులూ లేకుండానే నిర్మిస్తున్నారంది. రాష్ట్రంలోని పులికనుమ, గురురాఘవేంద్ర, పులికనుమ పథకాలపై అధ్యయనం చేసి లోపాలను ఎత్తిచూపింది. గురురాఘవేంద్ర, పులికనుమ పథకాలు రూ.584.97కోట్ల సవరించిన అంచనాలతోను, పట్టిసీమ రూ.1667.15కోట్ల సవరించిన అంచనాలతోను, పుష్కర రూ.674.50కోట్ల సవరించిన అంచనాలతోను పనులు చేపట్టారు. ఇందులో పట్టిసీమ తప్ప మిగిలిన మూడు ఎత్తిపోతల నిర్మాణాలూ కొనసాగుతున్నాయి.

- ఈ ప్రాజెక్టుల కింద ఉన్న డిస్ట్రిబ్యూటరీల ప్రవాహ సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఎత్తిపోతలు చేపట్టడం, పంపింగ్ సామర్థ్యానికి తగ్గట్టు డిస్ట్రిబ్యూటర్లను ఆధునీకరించకపోవడం వల్ల లక్షిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో ప్రయోజనాలు అందలేదు.
- పులికనుమ ఎత్తిపోతలను రూ.263.10కోట్లతో చేపట్టి ఎనిమిదేళ్లు అయినప్పటికీ ఆయకట్టును నిర్ధారించలేదు.
- పుష్కర ఎత్తిపోతలలోను ప్రాజెక్టు నివేదిక సక్రమంగా లేదు. తొలుత కోటనందూరు మండలంలో 1,223 ఎకరాలకు నీరివ్వాలని ఉంది. తర్వాత ప్రణాళిక మారడంతో తొలుత ప్రతిపాదించిన ఆయకట్టుకు నీరిచ్చే చర్యలే చేపట్టలేదు.
- పుష్కర అంచనా వ్యయం రూ.674.52కోట్లకు పెరిగింది. పైగా పోలవరం నిర్మాణం వల్ల దీని జీవనకాలం తగ్గిపోతోంది.

ప్రాజెక్టులు దశాబ్దాలపాటు నత్తనడకన నడుస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో 2016 మార్చి నాటికి పూర్తికావలసి వున్న 274 ప్రాజెక్టులు పూర్తికాలేదని తెలిపింది. 63 ప్రాజెక్టుల వాస్తవవ్యయాన్ని సవరించి 45.82శాతం పెంచటం వల్ల రూ.24,182.44కోట్లు అదనపు భారం పడిందని వెల్లడించింది. గడికోట రిజర్వాయర్ లిఫ్ట్ పథకాలు, పులివెందుల బ్రాంచి కెనాల్ లాంటి పథకాలు నత్తనడకన సాగుతున్న తీరు పట్ల కాగ్ అసంతృప్తి వ్యక్తం చేసింది.

### రాజధానికి కేంద్ర నిధుల్ని ఖర్చు చేయలేదు

రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధుల్ని ఖర్చు చేయలేదని కాగ్ వెల్లడించింది. దాదాపు ఏడాదిన్నర ఆలస్యంగా కొన్ని నిర్మాణాలు మొదలుపెట్టిందని, ఖజానాశాఖ బిల్లులను తిరస్కరించినందున గుంటూరు, విజయవాడల్లో భూగర్భ మురుగు కాలువల నిర్మాణానికి కేంద్ర మిచ్చిన వెయ్యికోట్లను వినియోగించలేదని తెలిపింది. వివిధ పథకాల కోసం రూ.345కోట్లను పీడీ ఖాతా నుంచి డ్రా చేసి వివిధ బ్యాంకు ఖాతాల్లో జమ చేయడాన్ని తప్పుపట్టింది. మరికొన్ని పథకాలకు వినియోగపత్రాలను జమ చేయలేదని తెలిపింది.

### రెవెన్యూ రికార్డుల తప్పులతడక

రెవెన్యూ రికార్డుల్లో లోపాల వల్ల ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కరవవుతోందని కాగ్ హెచ్చరించింది. రీసెటిల్‌మెంట్ రిజిస్టర్, ఎఫ్ఎంబీలు, గ్రామ పటాల్లాంటి మౌలికమైన రికార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని తేల్చింది. గ్రామస్థాయి నుంచి రికార్డుల్ని సక్రమంగా నిర్వహించటం లేదని, సర్వే నెంబర్ల విషయంలో మాన్యువల్ రికార్డులకి కంప్యూటరీకరించినవాటికి మధ్య పొంతన ఉండటం లేదని వెల్లడించింది. కాగ్ మచ్చుకి 40 మండలాల్ని ఎంచుకుంటే, 23 మండలాల్లో ఎఫ్ఎంబీలకు సంబంధించిన రికార్డులు లభించలేదు.

### వర్సిటీల్లో 33.52కోట్ల వృధా

ఎస్వీయూ, యోగి వేమన వర్సిటీల్లో రూ.33.52కోట్లతో చేపట్టిన భవనాల వల్ల ఎటువంటి ఫలితాలు లేవని కాగ్ దుయ్యబట్టింది.

### వాణిజ్య పన్నుల శాఖలో రూ.170.60కోట్ల మేరకు..

వాణిజ్య పన్నుల శాఖకు చెందిన 96 కార్యాలయాల పన్ను నిర్ధారణ దస్త్రాలు, రిఫండ్ రికార్డులు, సంబంధిత ఇతర పత్రాలను మచ్చుకు తనిఖీ చేయగా, 923 కేసుల్లో 170.60 కోట్ల విలువైన అల్ప నిర్ధారణలు, అవకతవకలు బైటపడ్డాయి.

### ఆడంబర ఖర్చులు

ఏపీ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణపై కాగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో కొన్ని గ్రాంట్లకు సంబంధించి బడ్జెట్ కేటాయింపుల కంటే అదనంగా రూ.36,734 కోట్లు కేటాయించింది. ఈ అధిక వ్యయానికి

## అప్పుల కుప్ప

రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వైనాన్ని కూడా కాగ్ తప్పు పట్టింది. 2015-16లో ఓవర్‌డ్రాఫ్టులు, ఆర్బీఐ నుంచి అంతర్గత రుణాల రూపేణా రూ.52,997కోట్లు సర్కారు తెచ్చుకుంది. ఆ ఏడాది మొత్తం అప్పుల భారం రూ.1,88,075 కోట్లకు చేరుకుందని కాగ్ తెలిపింది. పీడీ ఖాతాలు నిర్వహించటంలోనూ ప్రభుత్వం విఫలమైందని కాగ్ దుయ్యబట్టింది.

సంబంధించి కారణాలను కూడా ప్రభుత్వం నిర్దిష్టంగా వెల్లడించలేదు. బడ్జెట్ విశ్వసనీయతకు ఇది మంచిదికాదని ఘాటుగా కాగ్ వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని 205 ప్రకారం, బడ్జెట్ కేటాయింపుల కంటే అధికంగా చేసిన వ్యయాన్ని క్రమబద్ధీకరించవలసిన అవసరం ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని తెలిపింది. దీంతోపాటు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.847కోట్లు వృధా ఖర్చులు చేసినట్టు కాగ్ బైటపెట్టింది. 26 సందర్భాలలో 21 గ్రాంట్లకు సంబంధించి వాస్తవంగా అవసరమైంది రూ.9,193 మాత్రమేనని, అనుబంధ పద్దుల్లో రూ.19,204కోట్లు చూపించారని, ఈ పద్దులో రూ.10,011కోట్లు అదనంగా ఎందుకు అవసరమయ్యాయో ప్రభుత్వం వద్ద వివరణ లేదని తెలిపింది. నిధుల ఖర్చుకు సంబంధించి కూడా వాస్తవ ఖర్చు వివరాలు వెల్లడించకుండా వినియోగ ధృవపత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్లు) సమర్పించడాన్ని తప్పుపట్టింది.

### పైకి డ్యాష్‌బోర్డు, లోపల క్యాష్‌బోర్డు: భీశెట్టి ధ్వజం

ఏపీ ముఖ్యమంత్రి డ్యాష్‌బోర్డు పట్ల నీతి ఆయోగ్ సీఈవో అరవింద్ పనగడియా ఎంతో ముచ్చటపడి పారదర్శక పాలనకు అన్ని రాష్ట్రాలూ ఇలా టెక్నాలజీని అనుసరించాలని సూచించారని, కానీ డ్యాష్‌బోర్డు చాటున క్యాష్‌బోర్డు ఎలా మెయింటెయిన్ చేస్తున్నారో కాగ్ నివేదిక బట్టబయలు చేసిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. బోలెడంత సాంకేతిక పరిజ్ఞానం, చుట్టూ సమాచారం కనిపిస్తున్నా.. నిజాలు మాత్రం వెల్లడవటం లేదనటానికి ఏపీ పాలనపై కాగ్ నివేదికే నిదర్శనమన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ముసుగులో కాంట్రాక్టర్లకు ఎంత దోచిపెట్టారో, రాష్ట్రంలో 2,000 మార్కెట్ కమిటీలు అవసరముంటే ఉన్న 301 కమిటీలనూ ఎలా నిర్వీర్యం చేశారో కాగ్ బైటపెట్టిందన్నారు. ప్రజల రోజువారీ అవసరాలకు, స్వయంపాలనకు కీలకమైన పంచాయతీరాజ్ అవినీతితో ఎలా అధ్వాన్నంగా తయారైందో నివేదిక వెల్లడించిందన్నారు. పంచాయతీల్లో చెత్తను తొలగించలేని ప్రభుత్వం.. ఈ-పంచాయతీల గురించి గొప్పలకు పోతోందన్నారు. ప్రభుత్వ ఆడంబరాలను, ముఖ్యమంత్రి హెలికాప్టర్ అద్దెలో నిధుల దుర్వినియోగాన్ని కాగ్ బైటపెట్టినాక కూడా సమర్థించుకుంటారా? అని ప్రశ్నించారు. బంధుమిత్ర సపరివారానికి పందేరాలు చేయటంతోపాటు వచ్చే ఎన్నికలకు కూడా చంద్రబాబు భారీగా పోగేసుకుంటున్నట్టు కనిపిస్తోందని బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు పోలుపర్తి అప్పారావు, అల్లంశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### రోడ్ల భద్రత విషయంలోనూ వైఫల్యమే

అంతర్జాతీయ అభివృద్ధి, పునర్నిర్మాణ బ్యాంకు (ఐబీఆర్‌డీ) నిధులతో చేపట్టిన రహదారి భద్రత పనుల్లో రహదారులు, భవనాల శాఖలోని విభాగాల మధ్య సమన్వయలోపాన్ని కాగ్ తప్పుపట్టింది. నమూనా కారిడార్‌గా ఎంచుకున్న రేణిగుంట-రాయలచెరువు రోడ్ల పనుల్లో దొర్లిన తప్పిదాలు కాగ్ నివేదికలో బైటపడ్డాయి. ప్రమాదకర మలుపులు, కూడళ్లను మెరుగుపరిచే పనుల్ని ఆంధ్రప్రదేశ్ రహదారి అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) రూ.11.87కోట్లతో కాంట్రాక్టర్‌కి అప్పగించగా, అయిదు చోట్ల ఎలాంటి మెరుగుదలలూ చేయలేదని, మరో ఐదు చోట్ల రాజంపేట డివిజన్ ప్రభుత్వ నిధులతో చేశారని తేల్చింది. ఆర్ అండ్ బీతోపాటు రవాణా, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో రహదారి భద్రత పనులు చేపట్టాల్సి ఉన్నా జాప్యం జరుగుతూనే ఉంది. ట్రామాకేర్ కేంద్రాలు, అంబులెన్స్, వైద్యపరికరాల కొనుగోలు, చెక్‌పోస్టుల ఆధునీకరణ పూర్తికాలేదు. రహదారి భద్రత విధానం రూపకల్పనలో, ప్రమాదకర ప్రదేశాలను సరిచేసే పనుల్ని విశ్లేషించటంలో లోపాలున్నాయి.

### రిజిస్ట్రేషన్ శాఖలో తీవ్ర అలసత్వం

నల్లధనానికి మూలమైన రియల్ ఎస్టేట్ రంగంలో మార్కెట్

విలువల్ని సవరించే సందర్భాలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ తీవ్ర అలసత్వంతో వ్యవహరిస్తోందని కాగ్ మొట్టికాయలు వేసింది. కాలానుగుణ అభివృద్ధి, పెరిగిన వర్తమాన మార్కెట్ విలువల్ని పరిగణలోకి తీసుకోవడం లేదని తెలిపింది. ఆ విలువల్ని తెలిపే సమాచారాన్ని పరిగణిస్తున్న దాఖలాలు లేవని వెల్లడించింది. అసలు ఈ శాఖకు మార్కెట్ విలువ సమాచారం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిఘా నివేదికలు అందించే వ్యవస్థ కూడా లేకపోవటం ఓ లోపమని అభిప్రాయపడింది. 198 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మచ్చుకి రికార్డులు తనిఖీ చేస్తే, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములు విధించకపోవడం, తక్కువ వసూలు చేయడం లాంటివి వెల్లడయ్యాయని కాగ్ నివేదికలో వెల్లడించింది. ఇలాంటి కేసులు 696 వరకు ఉన్నాయని, వీటి విలువ రూ. 22.64 కోట్లని తేల్చింది.

**మద్యం దుకాణాలను తరలించే ప్రయత్నమే లేదు**

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాలకు సంబంధించి నిర్దేశిత అదనపు లైసెన్సు రుసుములలో అవకతవకల వల్ల ఖజానాకు గండిపడినట్టు కాగ్ గుర్తించింది. 27 ఎక్సయిజ్ కార్యాలయాల పరిధిలో 38 కేసుల్లో రూ. 1.29కోట్ల మేర నష్టం వాటిల్లింది. విద్య, ధార్మిక సంస్థలు, ఆసుపత్రులకు సమీపంలో ఏర్పాటైన బార్లు, మద్యం దుకాణాలకు సంబంధించి ఇప్పటివరకు సర్వేను చేపట్టలేదని, వాటిని అక్కడ్నుంచి తరలించే చర్యలు లేవని ఆక్షేపించింది.

**ఉపాధి పనులకు విరుద్ధంగా పాలన ఖర్చులు**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) మార్గదర్శకాలకు విరుద్ధంగా రాష్ట్రంలో పరిపాలన ఖర్చులు ఎక్కువ చూపడాన్ని కాగ్ విమర్శించింది. దీని కింద వేతనాలు, సామాగ్రి కోసం చేసిన వ్యయం.. మొత్తం ఖర్చులో గరిష్టంగా 6శాతం వరకు ఉండాలి. అధికారులు మాత్రం 2011-16 మధ్య రాష్ట్రంలో పరిమితి కంటే అదనంగా పరిపాలనా ఖర్చులుగా చూపారు. *

# ఓగేరు వాగుపై వంతెన నిర్మించండి




ఓగేరు వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి పోస్టు కార్డుల విజ్ఞప్తుల్ని పంపింది. ఈ సందర్భంగా.. గుంటూరు జిల్లా చిలకలూరిపేట గడియారం సెంటర్ వద్ద పోస్టు కార్డులతో పార్టీ నేతలు ప్రదర్శన నిర్వహించారు. స్థానికుల ఆకాంక్ష మేరకు ఓలేరు వాగు వంతెనను నిర్మించటం వల్ల పలు ప్రయోజనాలున్నాయని కార్యక్రమానికి నాయకత్వం వహించిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సంబంధించిన వ్యవసాయ భూములు వాగు అవతలి ప్రాంతంలో ఉన్నాయన్నారు. నిత్యం వ్యవసాయ పనులు చేసుకునేవారు.. ఒంగోలు బ్రిడ్జి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లవలసి వస్తోందన్నారు. దీంతో ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసి కూలీలను తీసుకెళ్లాల్సి వస్తోందని, ఇదో అదనపు భారంగా మారిందని అన్నారు. కళ్ల ముందే కనిపిస్తున్న వ్యవసాయ భూములకు రోజూ చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావటం పట్ల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. భవన నిర్మాణంలో ఉన్నవారు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశాన వాటికకు కూడా మూడు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. బ్రిడ్జి వేసినట్టయితే పలువురికి ఇబ్బందులు తప్పుతాయని, గోదాముల నిర్మాణానికి చిన్న వ్యాపారస్తులు కూడా ముందుకొస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజాప్రయోజనాలను కాపాడాలని మాదాసు అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి మురికిపూడి ప్రసాద్, సాదిక్, మురుకొండ వెంకటరావు, కేవీఆర్ రెడ్డి, పి.రామారావు, సిద్ధమ్మ, పద్మ, శివమ్మ, సుబ్బయ్య, రాము, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. *

# పేదరిక రహిత పంచాయతీలు

దేశవ్యాప్తంగా 50వేల పంచాయతీలను 2019లోగా పేదరిక రహితం చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఉపాధి హామీ పథకాన్ని ప్రధానంగా తీసుకుంటూ మరిన్ని కేంద్ర పథకాలను ఇక్కడ అమలు చేస్తుంది. నగదు రహిత కార్యకలాపాలూ ఒక సాధనంగా ఉంటాయి. 'మిషన్ అంత్యోదయ' పేరుతో రూపొందించిన ఈ పేదరిక నిర్మూలన కార్యక్రమం సజావుగా అమలైతే ఆయా పంచాయతీల్లోని ఒక కోటి మంది దారిద్ర్య రేఖ పైకి రావటానికి వీలవుతుంది. దీని అమలుకు రాష్ట్రాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మార్గదర్శకాలు వెలువడ్డాక రాష్ట్రాల్లో ఆయా కార్యక్రమాలను చేపట్టే పంచాయతీలు ఎంపికవుతాయి.

### పంచాయతీలను సిద్ధం చేయటం ఇలా..

పంచాయతీకి రోడ్ల అనుసంధానం కావాలి. అక్కడ అంతర్జాలం, వంటగ్యాస్, అందరికీ ఆధార్, నగదు బదిలీతోపాటు నగదు రహిత లావాదేవీలూ ఉండాలి. వృద్ధులు, వితంతువులకు సామాజిక భద్రత పథకం అమలుకావాలి. విద్యుత్తు, అందరికీ ఇళ్లు, ఆరు బయట మలవిసర్జన లేకపోవటం, చెత్త నిర్వహణ, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయ కార్యక్రమాలు, నీటి సంరక్షణ విధానాలు, బ్యాంకుల ద్వారా రుణాలు, నైపుణ్యాభివృద్ధికి శిక్షణలు, డ్వాక్రా సంఘాల్లో ఆర్థిక కలాపాలను పెంపొందించటం, క్రీడలు, యువజన కార్యక్రమాలు వంటివి చేపట్టాల్సి ఉంటుంది. ఉపాధి హామీ కూలీల్లో కనీసం 80శాతం మందికి ఆధార్ అనుసంధానం కావాలి. డ్వాక్రా సంఘాలు ఉండాలి. ఉపాధి హామీ ఇతర పథకాల్లో నగదు బదిలీ అమలు కావాలి.

### నిధులు

ఉపాధి హామీ సహా ఏడు ప్రధాన పథకాల నిధులతో ఏటా 15–20శాతం వృద్ధి ఉంటుందని, అవి పేదరిక నిర్మూలనకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇంకా ఐసీడీఎస్, స్వచ్ఛ భారత్ మిషన్ వంటి పలు పథకాలు ఇతర వనరులుగా ఉపయోగపడతాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు, నైపుణ్యాభివృద్ధి నిధులు, పంచాయతీల సొంత రాబడులు తదితరాలన్నీ కలిస్తే 2019 చివరినాటికి 50వేల పంచాయతీలను పేదరిక రహితం చేయటం సాధ్యమేనని సర్కారు అంచనా. అయితే వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, వార్డు స్థాయికి ప్రజల కమిటీలకు నిధులు వంటి ఏర్పాట్లు లేకుండా, అదనపు నిధులు కేటాయించకుండా.. ఉన్న నిధుల్నే మళ్లిస్తూ కేవలం ఉపాధి హామీ చుట్టూ ఈ కార్యక్రమాన్ని చేపట్టటం వల్ల పరిమిత ఫలితాలే వస్తాయని లోక్‌సత్తా నేతలు అభిప్రాయపడ్డారు.

### యాసంగి ధాన్యం సేకరణకు 3వేల కేంద్రాలు

ఈ ఏడాది యాసంగి ధాన్యం దిగుబడి రికార్డుస్థాయిలో 37లక్షల టన్నుల దాకా ఉంటుదన్న ప్రాథమిక అంచనాలతో తెలంగాణ ప్రభుత్వం మూడువేలకుపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. యాసంగి (రబీ)లో ఎక్కువగా ఉప్పుడు బియ్యం తెలంగాణలో పండుతుంది. లెవీ విధానం లేకపోవటంతో రైతుల నుంచి నేరుగా పౌరసరఫరాల శాఖ ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. కస్టం మిల్లింగ్ విధానం ద్వారా ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి సరఫరా చేయనుంది. వ్యవసాయశాఖ అంచనాల కన్నా ఈ ఏడాది తక్కువ మొత్తంలో వరి సాగైనప్పటికీ, చెరువుల కింద నీరు సమృద్ధిగా ఉండటంతో రాష్ట్ర చరిత్రలోనే భారీగా దిగుబడి ఉంటుందని తొలి అంచనా. ఈ నేపథ్యంలో పకడ్బందీగా ధాన్యం సేకరణ ప్రణాళికను అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైతే మూడు వేలకు అదనంగా కూడా కొనుగోలు కేంద్రాలను తెరవాలని జిల్లా యంత్రాంగాలకు ఆదేశాలిచ్చారు. నల్గండ, సూర్యాపేట, యాదాద్రి, సిద్దిపేట, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో 1.50లక్షల నుంచి రెండు లక్షల టన్నుల వరకు  ధాన్యం మార్కెట్‌కు వస్తుందని భావిస్తున్నారు. క్వింటా ఒక్కింటికి 'ఎ' గ్రేడ్ ధాన్యానికి రూ. 1,500, సాధారణ రకానికి రూ. 1,470గా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయించారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కరవు పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో ఉప్పుడు బియ్యాన్ని వ్యాపారులు కూడా ఎగుమతి కోసం కొనుగోలు చేసే అవకాశముందని, రైతులను దళారులు మోసం చేయకుండా తగు నిఘా పాటించాలని కూడా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. *

# ఈసురోమంటున్న విద్యార్థి భారతం



**భా**వి భారత పౌరులుగా దేశాన్ని నడిపించాల్సిన పాఠశాల విద్యార్థుల్లో ఎక్కువమందిలో శారీరక దృఢత్వం, ఎత్తు-బరువు నిష్పత్తి సూచీ (బీఎంఐ)ల స్థాయిలు దిగజారుతున్నాయని ఇటీవల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో కాకతీయ విశ్వ విద్యాలయం క్యాంపస్‌లో ఆమధ్య జరిగిన యూత్ పార్లమెంట్‌లో విద్యార్థి సత్తా తెలంగాణ ప్రధాన కార్యదర్శి తోట పవన్ ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలోనే పాల్గన్న విద్యార్థినీవిద్యార్థులనే ఉదాహరణగా చూపుతూ, వారి చేతే సున్నితంగా సంబంధిత వివరాల్ని చెప్పిస్తూ సమస్యను తెలియచెప్పే ప్రయత్నం చేశారు.

విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం లేకపోవటం దేశవ్యాప్త సమస్యని ఎడ్యుస్పోర్ట్స్ నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రాంతం, నగరం, బాల-బాలికల తేడాతో సంబంధం లేకుండా దేశంలోని మూడోవంతు మంది విద్యార్థుల్లో ఈ లోపం కొనసాగుతోందని నివేదిక తెలిపింది. దృఢత్వం పెంచటానికి విద్యార్థులకు వారానికి ఐదు పీరియడ్ల వ్యాయామం ఉండాలని ఎడ్యుస్పోర్ట్స్ తన పరిధిలో సూచించింది.

ఆరోగ్యానికి బీఎంఐ మాత్రమే ప్రాతిపదిక కాదు, కేవలం స్కూల్‌లో వ్యాయామ సమయం పెంచటంతోనే పరిష్కారం రాదుగానీ.. మనదేశంలో అత్యధిక శాతం పిల్లలు ఈసురోమంటూ ఉన్నారనేది హెచ్చరించే వాస్తవమనటంలో సందేహం లేదు.

పిల్లలు వయసుకు తగ్గ బలం, చురుకుదనంతో వ్యవహరించలేకపోతున్నారు. జీవనశైలి వ్యాధులు కూడా వారి మీద త్వరగా ప్రభావం చూపుతున్నాయి. వ్యాయామం, యోగా వంటి వాటి వల్ల దారుఢ్యాన్ని కొంత మెరుగుపరచవచ్చుగానీ, పూర్తిస్థాయి ఆరోగ్యమున్న ఉక్కునరాల జాతిని తయారుచేయలేం.

సమగ్ర పరిష్కారం.. మన ఆరోగ్య రంగాన్ని, ఆ మౌలిక రంగాన్ని వదిలేసి డ్రామాలాడుతున్న ప్రభుత్వ వ్యవస్థను ప్రక్షాళన చేయటంలో ఉంది. దిద్దుబాటు అక్కడ్నుంచీ మొదలై విద్యారంగ సంస్కరణలకు, పోషక విలువలున్న ఆహారాన్ని పండించే వ్యవసాయ పరిశోధనలకూ విస్తరించాలి. వ్యాయామ, ఆటస్థలాల కబ్జాపై ప్రభుత్వాలనీ డిమాండ్ చేసే స్థాయికీ వెళ్లాలి.

రియో ఒలింపిక్స్‌నే చూడండి.

రియో ఒలింపిక్స్‌లో కనీసం డజను పతకాలు సాధించాలని కలలుగన్నాం. పతకానికి డజను మంది చొప్పున గతంకంటే భారీసంఖ్యలోనే క్రీడాకారుల బృందాన్ని పంపాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ఆశీర్వదించారు. మీడియా హోరెత్తించింది. అగ్రదేశం దిశగా దూసుకుపోవాలని ఆకాంక్షిస్తున్న కోట్లాది భారతీయులమంతా ఉత్కంఠగా ఎదురుచూశాం. కానీ మన ఆశలకు తగ్గ పునాది లేదని ఆదిలోనే అర్థమైపోయింది. ఏదోక పతకం బోణీ కోసమే ఊపిరిబిగబట్టి చూడాల్సి వచ్చింది. సాక్షి మాలిక్ కంచు మోగిస్తే, సింధు కనక పతకాన్ని మోగించాలని.. తెలిసిన దేవుళ్లందరికీ మొక్కాం. గంభీరంగా ఉండే ప్రముఖులు కూడా ఉద్వేగాల్ని దాచుకోలేకపోయారు. శారీరక దారుఢ్యం, భావోద్వేగాల నియంత్రణ, వ్యక్తీకరణ.. ఇలా అన్ని విభాగాల్లో మనవాళ్ల కన్నా ప్రత్యర్థులు మిన్నగా ఉండటంతో ఏ క్రీడలోనూ మన ఆకాంక్షలు నెరవేరలేదు. ఐదు వేల ఏళ్ల చరిత్ర, గొప్ప క్రీడా సంస్కృతి, ప్రపంచంతో పోటీపడుతున్న ఆర్థిక శక్తి, 130 కోట్ల జనాభా, అందులోనూ మూడొంతులు యువత ఉన్నా ఒక్క స్వర్ణం కూడా లేకుండా రెండు పతకాలు సాధించామంటే లోపం ఎక్కడుంది?

ఒలింపిక్స్‌కు కొంతమందిని ఎంపిక చేసి శిక్షణనివ్వటానికి బాగా నిధుల్ని ఖర్చు చేయటం సంగతి సరే, అసలు ఒలింపిక్స్ లక్ష్యమైన క్రీడా సంస్కృతి మనదేశంలో ఎక్కడుంది? మన యువతలో ఎక్కువమంది ఆటలాడి గెలిచే శక్తి లేక ఈసురోమంటున్నారన్నది అసలు నిజం.

కాస్త ఎక్కువ కష్టపడినా అనారోగ్యం బారిన పడటం, ఒకసారి అనారోగ్యం పాలైతే తిరిగి పుంజుకోవటానికి అవస్థలు పడటం, పౌష్టికాహారం లేకపోవటం మనదేశాన్ని కుంగదీస్తున్నాయి.

మనదేశంలోని ఆరేళ్లలోపు పిల్లల్లో 68శాతం పౌష్టికాహార కొరతతో అల్లాడుతున్నారు. వ్యాధినిరోధక శక్తి లోపించిన అసంఖ్యాక బాలలు చదువులో, ఆటల్లో అరకొర ప్రతిభే తప్ప ప్రపంచస్థాయిని అందుకోవటం దాదాపు అసాధ్యం.

కాబట్టి ఒలింపిక్ పతకాల్లో మన కలలకు, వైఫల్యాలకు మధ్య అంతరానికి మూలం ఆరోగ్యంలో ఉంది. ఆరోగ్యాన్ని బాగు చేస్తే చాలు.. పటుత్వం, పౌష్టికాహారం, దృఢత్వం అన్నీ అందులో వచ్చేస్తాయి.

2030నాటికి కేవలం జీవనశైలి వ్యాధుల భారం వల్ల భారతదేశ 4.3 ట్రిలియన్ డాలర్ల మేర (సుమారు రూ. రెండున్నరకోట్ల కోట్లు) నష్టపోవలసి వస్తుందని ప్రపంచ ఆర్థిక ఫోరం హెచ్చరించింది. చిన్నతనంలో పౌష్టికాహార లోపం, టీకాలు, వైద్యసేవలు సక్రమంగా అందకపోవటంతో త్వరగా జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు.

దీనికి, జీవనశైలికి సంబంధించి ఆర్థిక, సామాజిక రంగాలలో ఇతరత్రా నివారణాచర్యలు చేపడుతూనే.. పౌష్టికాహారాన్ని, సరైన ఆరోగ్య వసతుల్ని కలగలిపి అందరికీ అందుబాటులోకి తెచ్చే సమగ్ర వైద్య ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలి. ఆటలు, వ్యాయామం, భారంలేని నాణ్యమైన చదువులు వంటివి జోడించాలి.

రియో ఒలింపిక్స్‌లో పతకం కోసం చూపిన ఉత్సుకతలో సగం ఆరోగ్య రంగంలో మార్పు కోసం చూపినా ప్రభుత్వం చేత అందరికీ ఆరోగ్యం ఇచ్చే విధానాన్ని అమలు చేయించగలం. ఆరోగ్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని మనం తెలుసుకోవాలి, గుర్తుచేసుకోవాలి.

మరోమాట. రియో ఒలిపింక్స్ సమయంలో కేవలం రెండు వేల మందికి 'జికా' వైరస్ సోకితే ప్రపంచమంతా అట్టుడికిపోయింది. పుంఖానుపుంఖాలుగా కథలు, కథనాలు వచ్చాయి. మనదేశంలో నివారించదగ్గ వ్యాధులతో ఏటా 12లక్షలమంది చిన్నారులు చనిపోతుంటే మాత్రం ఏమీ జరగనట్టు ఇతర విషయాల గురించి ముచ్చటిస్తుంటాం. ఇటీవల ప్రభుత్వం ఆమోదించిన జాతీయ నూతన ఆరోగ్య విధానం కూడా అరకొరగానే ఉంది. దేశానికి సమగ్ర ప్రజారోగ్య విధానం ఇంకోసారి వాయిదాపడిందన్న మాట.

కాబట్టి దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఆరోగ్యం. దీనిపై అడగాల్సింది ప్రభుత్వాన్ని.

(ఆరోగ్య రంగానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఖర్చు చేస్తున్న నిధులకు అదనంగా కేవలం 0.6 – 0.8శాతం కేటాయిస్తే.. 1 కోటి ఉద్యోగాలను సృష్టించటంతోపాటు ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం అందించేలా ప్రజారోగ్య విధానాన్ని లోక్‌సత్తా రూపొందించింది. నీతి ఆయోగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, వివిధ రంగాలవారి మద్దతు సమీకరించేందుకు ప్రయత్నం చేస్తోంది. లోక్‌సత్తా రూపొందించిన అందరికీ ఆరోగ్యం విధానం పూర్తి వివరాల్ని www.fdrindia.org లో చదవొచ్చు) *

# విద్యావ్యవస్థలో ఓటుబ్యాంకు రాజకీయాలు తగదు

- గన్‌రెడ్డి రాజారెడ్డి,
లోక్‌సత్తా జాతీయ ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్

**వి**ద్యావ్యవస్థలో పార్టీ రాజకీయాలు అనుచిత స్థాయిలో పెరగటం వల్లే యూనివర్సిటీల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యార్థుల్లో అసంతృప్తి, సిబ్బందిలో అభద్రతా భావం వ్యక్తమవుతున్నాయి. దీంతో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. వీటన్నింటికీ కారణం విద్యావ్యవస్థను దేశ ప్రయోజనాలతో ముడిపెట్టి పార్టీలకతీతంగా చూడలేకపోవటమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారి వారి అభిరుచుల మేరకు విద్యావ్యవస్థలో మార్పుల్ని చేస్తున్నారు. యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్లను ఆయా ప్రభుత్వాలు గుప్పెట్లో పెట్టుకుంటున్నాయి. దీంతో విద్యార్థుల్లో అనైక్యత చోటుచేసుకుని, విధానాల మీద కాకుండా పార్టీలపరంగా బాహాటంగా ఘర్షణలకు దిగుతున్నారు. కుల, మత ఉద్రేకాలు కూడా పెచ్చరిల్లుతున్నాయి. కులాలవారీగా శిబిరాల్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఏ కులం వారు ఆ బృందంతోనే కలసివుండటం ఓ కల్చర్‌గా మారింది. కుల, మత ప్రాతిపదికన విద్యావ్యవస్థ ఉండటానికి అనుమతించరాదు. యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికల్లో, వీసీల ఎంపికల్లో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోకూడదు. విద్యావ్యవస్థలో శాస్త్రీయంగా విధానాలు కొనసాగాలి. ప్రస్తుతం యూనివర్సిటీల్లో ఇండస్ట్రియల్ టైఅప్ లేదు. నైపుణ్యత, విలువలతో కూడిన నిబంధనలు లేవు. ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా పాలసీలు మారుతున్నాయి. సాధిస్తున్నది మాత్రం యధాతథస్థితినే. అలా జరగకుండా యూనివర్సిటీలలో ఇండస్ట్రియల్ టైఅప్, సమాజం, దేశ పాలనా సంస్కరణల పట్ల అవగాహన పెంచే బోధనా విధానం ఉంటే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి, దేశ నిర్మాణమూ జరుగుతుంది. నైపుణ్యతను బట్టి నియామకాలు జరిగితే సిబ్బందిలోనూ అభద్రతా భావం ఉండదు. పార్టీ రాజకీయాల జోక్యం లేకుంటే.. నైపుణ్యత, విలువల ఆధారంగా శాస్త్రీయ విద్యావిధానాల రూపకల్పన జరుగుతుంది. వాస్తవాల్ని మార్చటానికి అవకాశం లేని గణితం, సైన్స్ వంటి సబ్జెక్టులకు బోధనలో ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి.. రాజకీయ కాలుష్యాన్ని మరీ అంత పట్టించుకోనక్కర్లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా గుర్తించి వాస్తవిక దృష్టితో వ్యవహరించాలి. *

# పన్నులు ఎందుకు చెల్లించాలో చెప్పాలి!



ప్రజలు పన్నులు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని గత వారం రోజులుగా విజయనగరం పట్టణంలో మునిసిపల్ అధికారులు టముకు వేస్తున్నారని.. కనీస సేవలు కూడా సక్రమంగా అందించలేని పురపాలకులకు ఎందుకు పన్నులు చెల్లించాలని లోక్‌సత్తా పార్టీ పట్టణ, నియోజకవర్గ అధ్యక్షులు మొల్లేటి చిన్నారావు, అల్లంశెట్టి నాగభూషణం ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి పట్టణంలోని రైతు బజారు, చేపల మార్కెట్ ప్రాంతాలను వారు సందర్శించారు. రోడ్డుకి ఇరుపక్కలా నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు పడుతున్న అవస్థలను పరిశీలించారు. పట్టణమంతా గోతులమయంగా, చెత్తకుప్పలతో నిండివుందని, జనానికి సరైన సేవలు అందించినప్పుడే పన్నులను డిమాండ్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో తాత్రాజు రాజారావు, తిప్పాన కోటేశ్వరరావు, పోలుపర్తి అప్పారావు, రంధి రవి, లక్కరాజు శివ రామారావు, శిమ్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు. *

# ఆడంబరాలు లేని రచయిత పతంజలి







ఆడంబరాలు లేని, రాయని కవి పతంజలి అని ప్రముఖ రచయిత, కవి దేవీప్రియ అన్నారు. సమాజంలోని రుగ్మతలను కడిగేస్తూ పతంజలి రాసిన కథలు నేటికీ సజీవంగా, సాహితీ పరిశోధనకు ముడిసరకులుగా కొనసాగుతున్నాయని అన్నారు. పతంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో పతంజలి పురస్కారాన్ని ఆయనకఅందుకున్నారు. విశ్వజనీన భావాలతో కథా పరిధిని అనితరసాధ్యంగా పతంజలి విస్తృతం చేశారని, ఒక ప్రాంతానికో రాష్ట్రానికో పరిమితం చేయకుండా ఈ అవార్డుల్ని ఇతర రాష్ట్రాలవారికీ అందించాలని ఈ సందర్భంగా దేవీప్రియ కోరారు. లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, పతంజతి వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. తొలుత గురజాడ గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పతంజలి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుప్పల రవికుమార్, రామతీర్థ, పద్మనాభం, పతంజలి సతీమణి ప్రమీల, ఇతర కుటుంబ సభ్యులు, చలం, నాగేంద్ర ప్రసాద్, శ్రీనివాసరావు, దంతులూరి దిలీప్, లక్ష్మణరావు, మోహన్, దప్పు శ్రీను, కళాకారులు, కవులు, విద్యార్థులు పాల్గన్నారు. ఎ.అలమండకు చెందిన ఉత్తమ విద్యార్థి రవికుమార్‌కి కార్యక్రమంలో నగదు పురస్కారాన్ని అందించారు. *

# గ్రామన్యాయాలయాల అమలుతో బడుగు బలహీన వర్గాలకు న్యాయం

దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో కేసుల పరిష్కారానికి గ్రామన్యాయాలయాల చట్టాన్ని తక్షణం అమలుచేయాలని ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్ సంస్థ జాతీయ ఛైర్మన్ భగవాన్ జీరైన డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాలకు తక్కువ ఖర్చుతో, వేగంగా న్యాయం అందుబాటులోకి ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 2008లో ఈ చట్టం వచ్చినా ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపటం లేదన్నారు. హైదరాబాద్ తార్నాకలోని సత్యోదయంలో సొసైటీ ఫర్ ఫాస్ట్ జస్టిస్, ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్ (ముంబయి) ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నజీర్‌ఖాన్, ఎ. ఆనందరావు, జయవింద్యాల, పి. దామోదర్‌రెడ్డి, ముజాబుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



**ఆధిపత్యం కోసం హైకోర్టులే గండికొడుతున్నాయి**

గ్రామన్యాయాలయాల చట్టాన్ని తీసుకురావటంలో 2001 నుంచి లోక్‌సత్తా చేసిన కృషే కీలకం. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ చట్టాన్ని గ్రామ, పట్టణ తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో స్థానిక న్యాయస్థానాల చట్టంగా బిల్లులో ప్రతిపాదించినా.. యూపీయే ప్రభుత్వం కేవలం గ్రామాలకే పరిమితం చేసింది. 2008లో ఈ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించి న్యాయస్థానాల ఏర్పాటుకు నిధుల్ని మంజూరు చేస్తామన్నా.. రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవటం వల్ల ముందుకు కదలటం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకూ ఒక్క కోర్టు కూడా ఏర్పాటవ్వలేదు. ఈ కోర్టుల కోసం నోటిఫై చేయాల్సిన హైకోర్టు తమ ఆధిపత్యానికి గండిపడుతుందన్న భయంతో ఇందుకు చొరవ చూపటం లేదని పాలకులు తప్పించుకుంటున్నారు. న్యాయసేవలు ఆలస్యమవుతున్నాయని తరచూ ఫిర్యాదు చేస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సైతం.. స్థానిక న్యాయాలయాలతో వెంటనే చౌకగా ప్రజలకు న్యాయం అందించేందుకు ప్రయత్నించటం లేదు. గ్రామన్యాయాలయాల చట్టాన్ని విస్తరించి, పట్టణ ప్రాంతాలలో కూడా స్థానిక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా ఇలా 10,000 కోర్టుల్ని ఏర్పాటు చేస్తే చాలా కేసులు పరిష్కారమై మహిళలపై అత్యాచారాలు, రాజకీయాలలో నేరచరితులు కూడా తగ్గుతారని జేపీ పలుమార్లు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. న్యాయకళాశాలల్లో చదువుతున్న, కొత్తగా పట్టభద్రులవుతున్న న్యాయవాదులు, పౌరసమాజం, మీడియా కూడా గొంతు విప్పి స్థానిక న్యాయస్థానాల చట్టాన్ని అమలు చేయించుకోవాల్సిన అవసరం ఉంది. *

# టీఆర్ఎస్ ప్లీనరీని వాయిదా వేయాలి

జన తెలంగాణ నిర్మాణానికి మూలమైన విద్యావ్యవస్థకు స్ఫూర్తినిచ్చే ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం అధికార తెలంగాణ రాష్ట్ర సమితి బహిరంగ సభ, ప్లీనరీని వాయిదా వేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి అల్లేని నిఖిల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ అంబర్‌పేట నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు మునిపల్లి వెంకటేష్‌తో కలిసి నల్లకుంట కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఓయూ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలోనే తెరాస సభ జరుపుకోవటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓయూకి విచ్చేస్తున్న జాతీయ నాయకుల ముందు తెరాస బలప్రదర్శన చేస్తున్నట్టుందన్నారు. ఉస్మానియా ఉత్సవాలు ముగిసే వరకు అధికార పక్షం సభను వాయిదా వేసుకోవాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు హరి, సంతోష్, మురళి, గోపి తదితరులు పాల్గొన్నారు. *



# టీవీ న్యూస్ సంచలనాలు.. అవాక్కయ్యే వాస్తవాలు

పఠాన్‌కోట్ ఉగ్రదాడిపై కీలక సమాచారాన్ని ప్రసారం చేసినందుకు 'ఎన్డీటీవీ ఇండియా' హిందీ ఛానల్‌పై మోదీ ప్రభుత్వం వన్డే నిషేధం విధించటంపై పెద్ద దుమారమే రేగింది. మీడియా స్వీయనియంత్రణకు, ప్రమాణాలకు ఏం చేయాలన్నదానిపై తిరిగి చర్చ రాజుకుంది. అయితే రేటింగ్స్ కోసం ఆరాటంలో టీవీ ఛానళ్లు ప్రసారం చేస్తున్న పలు సంచలన వార్తల వెనక వాస్తవాల్ని తెలుసుకుంటే మాత్రం.. మనం ఈ విషయం అంత తేలికైంది కాదని గుర్తిస్తాం. ఎన్డీటీవీతో ఎంతో అనుబంధమున్న ప్రముఖ జర్నలిస్టు శేఖర్ గుప్తాయే టీవీ ఛానళ్ల తీరుతెన్నులు, వార్తల వెనక నిజాల్ని క్రోడీకరిస్తూ రాసిన 'మోర్ న్యూస్ ఈజ్ గుడ్‌న్యూస్: అన్‌టోల్డ్ స్టోరీస్ ఫ్రం 25 ఇయర్స్ ఆఫ్ టెలివిజన్' పుస్తకంలో ఇలాంటి అంశాల్ని పొందుపరిచారు. అందులో ఒకటి కసబ్ బిర్యానీ అంశం.




'ముంబయిలో మారణహోమం సృష్టించి పోలీసులకు పట్టుబడ్డ పాక్ ఉగ్రవాది అజ్మల్ కసబ్.. జైలులో బిర్యానీ కావాలని గొడవ చేసేవాడని విన్నాం. ఈ ఉగ్రవాదులకు బిర్యానీ తినిపించే ప్రక్రియ ఇప్పటిది కాదు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సైతం టెర్రరిస్టులకు బిర్యానీ తినిపించారని అప్పట్లో వార్తలు వచ్చాయి.

సీమాంతర ఉగ్రవాదం, వేర్పాటువాదం కాశ్మీర్‌ను తీవ్రంగా వణికిస్తున్న రోజులవి. ఎడతెగని ఆందోళనలను అదుపుచేసే క్రమంలో పీవీ సర్కారు.. ఉగ్రవాదుల (వేర్పాటువాదుల)తో చర్చలు జరపాలని నిర్ణయించింది. 1993లో శ్రీనగర్‌లోని ప్రఖ్యాత హజ్రత్ బాల్ దర్గా వేదికగా చర్చలు జరిగాయి. గంటలపాటు జరిగిన నాటి చర్చల్లో భోజన విరామం అనివార్యమైంది. కానీ చివరికి చర్చలు విఫలమయ్యాయి. 'చేతికి చిక్కిన టెర్రరిస్టు నాయకులను చంపకుండా.. పీవీ నరసింహారావు వాళ్లకు బిర్యానీ పెట్టి పంపించారు' అని పెద్దఎత్తున విమర్శలు చెలరేగాయి. మీడియా సంస్థలు సైతం పీవీ బిర్యానీని సంచలనంగా మార్చి విమర్శల వ్యాప్తికి దోహదం చేశాయి.

### అసలేం జరిగింది?

నిజానికి కసబ్ బిర్యానీ అడగనేలేదని, అతనిపై జడ్జీలకు, ప్రజలకు కోపం పెరగాలని (!) తానే బిర్యానీ థియరీని సృష్టించినట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ తర్వాతికాలంలో (కసబ్ ఉరితీత అనంతరం) వెల్లడించారు. అలానే పీవీ టెర్రరిస్టులకు బిర్యానీ వడ్డించారన్నది కూడా పచ్చి అవాస్తవం. అప్పటి చర్చల్లో భోజనం తిన్నది నిజమే. అయితే అది సీఆర్‌పీఎఫ్ క్యాంప్ నుంచి తెప్పించిన సాధారణ భోజనం. కాశ్మీరీ రచయిత బషారత్ పీర్ వివరణ ప్రకారం అసలు కాశ్మీరీలు బిర్యానీని పెద్దగా ఇష్టపడరు. ఈ రెండు సందర్భాల్లోనూ కనీస నిజనిర్ధారణ లేకుండా వార్తాసంస్థలు చర్చ చేశాయి.

### అలాంటివి ఎన్నో..

2014లో బదౌన్‌కు చెందిన ఇద్దరు దళిత యువతులపై సామూహిక అత్యాచారం, హత్య ఉదంతం కూడా అలాంటిదే. ఆ ఘటనపై టీవీ చర్చల్లో నాయకులు ఆవేశపూరితంగా మాట్లాడుతూ నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. నిజానికి అది అత్యాచారహత్య కాదు.. ఆత్మహత్య అని తర్వాత తేలింది. ఇలాంటివి చూశాక, టీవీ చర్చలను 'పెద్ద జోక్'గా వీక్షకుడు భావించడా? రోహ్‌తక్ అక్కాచెల్లెళ్లు తమను బస్సులో వేధించిన ఆకతాయిని తన్ని పతాకశీర్షికల్లో చోటుచేసుకున్నారు. వారి సాహసాన్ని మెచ్చుకుంటూ ప్రభుత్వం వారికి రివార్డులు కూడా ప్రకటించింది. కానీ ఆ తెగింపు దృశ్యాలన్నీ నాటకమని, తన్నులు తిన్నది వాళ్ల మనిషే అని తెలిసిన తర్వాత మనం ముక్కున వేలేసుకున్నాం. ఈ సందర్భంలోనూ టీవీ చర్చలు కామెడీ షోలయ్యాయి. నాగాలాండ్‌లో ఓ మహిళపై అత్యాచారం చేశాడనే ఆక్రోశంతో జనం.. జైలు గోడలు బద్దలుకొట్టి మరీ లోపలున్న యువకుడ్ని బైటికి ఈడ్చుకొచ్చి కొట్టి చంపారు. అసలు ఆ యువకుడికీ, రేప్‌కు సంబంధమే లేదని, నిజానికి అతడో అమర సైనికుడి సోదరుడని తేలింది. కోల్‌కతాలో 70ఏళ్ల క్రైస్తవ సన్యాసినిపై రేప్ కేసులో పట్టుబడ్డ యువకులదీ ఇలాంటి గాథే. విషయం తెలిసిన వెంటనే.. టీవీ ఛానెళ్లు దానిపై విస్తృత చర్చను మొదలుపెడతాయి. అభిప్రాయ ప్రకటనలో వక్తలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తారు. అందులోని నిజానిజాలు గురించి తెలుసుకునే ప్రయత్నం చేయరు'.

.. ఇలాంటి ఎన్నో అభిప్రాయాల సంకలనమైన 'మోర్ న్యూస్ ఈజ్ గుడ్‌న్యూస్' పుస్తకాన్ని హార్పర్ కోలిన్స్ సంస్థ ప్రచురించింది. ఎమ్మార్పీ రూ. 799, అమెజాన్‌లో రూ. 543కే లభిస్తుంది.

*

# 130 కోట్ల జనాభాలో ప్రతిభ గలవారిని వేళ్లమీద లెక్కిస్తున్నాం: జేపీ



రాజకీయ నిర్ణయాల ప్రభావం దేశంపై తీవ్ర ప్రభావం చూపుతుందనటానికి, ఆర్థిక వ్యవస్థలనూ కదిలిస్తుందనటానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అన్ని రంగాలకూ మూలమైన రాజకీయ రంగంలో మన దేశంలోనైతే వాగాడంబరులు ఉన్నారు తప్ప.. సమాజహితాన్ని, దేశాభివృద్ధిని అనుసంధానం చేయగలవారు కరవవుతున్నారని అన్నారు. దాదాపు 130కోట్ల జనాభా గల భారత్‌లో వివిధ రంగాలలో నైపుణ్యం, ప్రతిభ గలవారు వేళ్ల మీద లెక్కపెట్టగలిగిన సంఖ్యలోనే ఉండటం విచారకరమన్నారు.

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు వల్లూరుపల్లి వెంకటరామశేషాద్రిరావు స్మారకోపన్యాసం, కళాశాల వార్షికోత్సవ కార్యక్రమాల్లో జేపీ పాల్గొన్నారు.

సాంకేతికాభివృద్ధికి తగ్గ వేగంతో సమాజాభివృద్ధి సాగనప్పుడు వైరుధ్యం వల్ల అంతరాలు, అగాధాలు ఏర్పడతాయని జేపీ అన్నారు. సాంకేతికత మానవ సమస్యల్ని పరిష్కరించేలా జాతి నిర్మాణం జరగాలన్నారు. అన్ని రంగాలలో నైపుణ్యాభివృద్ధిని పరిగణలోకి తీసుకుని 57దేశాలను పరిశీలిస్తే మనదేశం పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల సరసన 55వ స్థానంలో ఉందన్నారు. నేడు దేశంలోని వివిధ పెద్ద సంస్థలు పలు కారణాల వల్ల 20లక్షల కోట్ల నష్టంలో ఉన్నా సరిదిద్దే రాజకీయ సాహసం కానరావటం లేదన్నారు. దేశంలో అపార సహజ వనరులు, మానవ సంపద, అద్భుత మేధస్సు, సాంకేతికత ఉన్నా.. పని చేసే ఆసక్తి, అభిరుచుల్ని పెంచుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా యువత కష్టపడి ఇష్టంగా పనిచేస్తే కొన్నేళ్ల తర్వాతైన భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు.

కేవలం ప్రసంగంలా కాకుండా చర్చా వేదికలా కార్యక్రమాన్ని జేపీ నిర్వహించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చారు. మొదటి పారిశ్రామిక విప్లవం నుంచి నాలుగో పారిశ్రామిక విప్లవం వరకూ జరిగిన జరుగుతున్న పరిణామాలను తెలియచేశారు. సౌరశక్తి వినియోగం, త్రీ డీ ప్రింటింగ్, ఆటోమొబైల్ నిర్మాణ విపణి, ఫ్యూజన్ ఆఫ్ టెక్నాలజీస్ దిశగా జరుగుతున్న మార్పుల వల్ల ఆర్థిక సంస్కరణల్లో మార్పులు గురించి వివరించారు.

అనంతరం శేషాద్రిరావు మెమోరియల్‌గా వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు ఏటా ఇచ్చే రూ.లక్ష నగదు పురస్కారాన్ని జేపీకి జీఈసీ ఛైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు అందచేశారు. డీన్ డాక్టర్ బుర్రా కరుణ్ కుమార్ జేపీపై రచించిన అక్షర సౌగంధికా సుమమాలను స్టాండింగ్ ఒవేషన్ మధ్య చదివి అందచేశారు. కళాశాల ప్రతినిధులు తనను సన్మానించబోతుండగా వారించి.. చక్కటి విద్యాసేవలందిస్తున్న యాజమాన్యానికే సన్మానం అందాలంటూ జేపీ వారిని సత్కరించారు. కార్యక్రమంలో జీఈసీ అధ్యక్ష, కార్యదర్శులు వల్లభనేని సుబ్బారావు, వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు, ప్రోగ్రాం కన్వీనర్ కవిత, ఎంబీయే హెచ్‌వోడీ నిర్మల్‌చంద్ తదితరులు పాల్గొన్నారు. విద్యలో ప్రగతి చూపిన విద్యార్థినీవిద్యార్థులకు జేపీ బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతుల్ని అందచేస్తూ.. ప్రతిభ అంటే మార్కులు కాదని, బండెడు పుస్తకాల చదువుకన్నా, గుప్పెడు నాణ్యమైన విద్య మెరుగని సూచించారు. *

# చంద్రబాబుది రాజ్యాంగ ఉల్లంఘన: జేపీ

రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అమలు చేయకుండా ఉన్న పాలకులు ఇప్పుడు రాజ్యాంగాన్ని పచ్చిగా ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రిపదవులు ఇవ్వటం రాజ్యాంగ ఉల్లంఘనన్నారు. తెలుగుదేశం పార్టీని సొంత ఆస్తిగా. ప్రభుత్వాన్ని వ్యాపారంగా మార్చేశారన్నారు.

# నిజమైన తెలుగుదేశం అంతరించిపోయింది: భీశెట్టి



అర్హులైనవారిని వదిలేసి ఫిరాయింపుదారులకు చంద్రబాబు నాయుడు మంత్రిపదవులిచ్చారని, ఎన్టీరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ అంతరించి పోయిందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. మహిళలు, గిరిజనులకు అవకాశం ఇవ్వకుండా అవమానించారన్నారు. చంద్రబాబు మంత్రివర్గాన్ని చూసి అది ఏ పార్టీ ప్రభుత్వమని తెదేపా కార్యకర్తలే ఆవేదన చెందుతున్నారన్నారు. విజయనగరం జిల్లాలోని తెదేపా ఎమ్మెల్యేలను కనీసం పట్టించుకోకుండా కించపరిచారన్నారు. మంత్రి మృణాళినికి ఉద్వాసన పలికితే ఆమె స్థానంలో కోళ్ల లలిత కుమారి, గీత, సంధ్యారాణి, కేఏ నాయుడు, బొబ్బిలి చిరంజీవి, పతివాడల్లో ఎవరో ఒకరికి ఇవ్వకుండా.. ఫిరాయింపుదారులకు అవకాశమిచ్చారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చంద్రబాబు తీరు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మాయనిమచ్చన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు రంధి రవికుమార్, శ్రీను, చంద్రరావు, సన్యాసి నాయుడు, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చంద్రబాబు మంత్రి పదవులివ్వటం, గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించటానికి నిరసనగా లోక్‌సత్తా పార్టీ నేతలు పలుచోట్ల రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఎ.నాగభూషణ్, చిన్నారావు, టి.రాజారావు, పి. అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొనగా, విశాఖ నగరంలో ఎంఎస్ఎన్ మూర్తి, హరిగణేష్, చిరంజీవి, శర్మ, హర్ష, పక్కి శంకరరావు తదితరులు పాల్గొన్నారు. *

# ఇక్కడో న్యాయం, అక్కడో న్యాయమా?

నైతిక విలువలకు తిలోదకాలిచ్చి చంద్రబాబు నాయుడు అనైతికతను అందలమెక్కించారని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏపీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. తెలంగాణలో తెదేపా ఎమ్మెల్యేలను తెరాస కొనుగోలు చేస్తే గగ్గోలు పెట్టి నీతివాక్యాలు వల్లించిన చంద్రబాబు.. ఇప్పుడు అదేపనిని ఏపీలో ఎలా చేశారని ప్రశ్నించారు. ప్రజలకు వెన్నుపోటు పొడిచినవారికి మంత్రిపదవులు ఎలా ఇస్తారన్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన గవర్నర్, స్పీకర్ వ్యవస్థలను దిగజారుస్తున్నారన్నారు. *




# భారత శక్తిసామర్థ్యాలను వెలికితీయటానికి కార్యాచరణ


భారత శక్తిసామర్థ్యాలను వెలికితీయటానికి కార్యాచరణపై ముంబయి నెహ్రూ సెంటర్‌లో ప్రసంగిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జయప్రకాష్ నారాయణ్!... నిజాయతీ, సామర్థ్యానికి పేరొందిన కేబినెట్ మాజీ కార్యదర్శి, ప్రముఖ సామాజిక సేవకుడు బీజీ దేశ్‌ముఖ్ స్మారకోపన్యాసంగా ముంబయిలోని పీసీజీ (పబ్లిక్ కన్‌సర్న్ ఫర్ గవర్నెన్స్) ట్రస్టు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది ట్రస్టు ఈ కార్యక్రమాన్ని రెండేళ్లుగా నిర్వహిస్తోందని, భారత మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వినోద్ రాయ్, పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీ తొలి రెండు కార్యక్రమాలలో ప్రసంగించారని వ్యవస్థాపక ట్రస్టీ జూలియో రెబిరో తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ముంబయిలోని పాఠశాలలు, ఎంపిక చేసిన కళాశాలల్లో విద్యార్థులు, యువతను వివిధ కార్యక్రమాల ద్వారా పీసీజీటీ చైతన్యపరుస్తుంటుంది.

Posting Date 22-04-2017

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on April16th 2017

# నిజాలు మాట్లాడుకుందాం-18

రాజధానులు కేవలం పరిపాలనా కేంద్రాలు మాత్రమే!
అభివృద్ధి మొత్తం అక్కడే కేంద్రీకరిస్తున్నారు...
విభజన ఘట్టం నుండి పాఠం నేర్చుకోలేదు ...
రాజధానిలో ఉంటేనే బతుకు అన్న భావన కల్పిస్తున్నారు
అమెరికా లో రాష్ట్రాల రాజధానులేవీ ప్రముఖ నగరాలు కావు!
అభివృద్ధి అంటే రాజధాని అనుకోవడం మూర్ఖత్వం !



షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి

| Book-Post<br>PRINTED MATTER | To |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad